కాళేశ్వరంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ..



16లో..



వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

మంగళవారం 17, నవంబర్ 2026 16 పేజీలు

మిన్నపాలు మింటూరా..?



2లో..

ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో, నవంబర్ 16, ప్రభాతవార్త : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో గోదావరి నదిపై సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది.. గోదావరి జలాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి.. సాగునీటి ప్రయోజనాలు పొందాల్సిన స్థానిక ములుగు జిల్లా రైతాంగంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులు ఎదురుచూస్తున్నారు.. కానీ సమ్మక సాగర్ కు అంతరాష్ట్ర అనుమతుల చిక్కు మాత్రం వీడటం లేదు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం లభించకపోవడంతో..



ఛత్తీస్ ఘడ్ సీఎం.. విష్ణుదేవ్ సాయి



తెలంగాణ సీఎం.. రేవంత్ రెడ్డి

- సమ్మక్క సాగర్ ఎన్ఓసీ కోసం తెలంగాణ ఎదురుచూపులు..
- ఛత్తీస్‌గఢ్ సీఎంతో నేడే సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
- ముంపు భూముల పరిహారమే ప్రధాన చిక్కు..
- 83 మీటర్లు ఫుల్ రిజర్వాయర్ లెవెల్...
- 88 మీటర్ల హెవీ ఫ్లడ్ నీటిమట్టాలపై భిన్నాభిప్రాయాలు..
- రూ.9.88 కోట్లతో ముంపు సర్వే.. పరిహారానికి తెలంగాణ సర్కార్ హామీ..
- కేంద్రం చొరవతోనైనా అంతర్రాష్ట్ర వివాదం కొలిక్కి వచ్చేనా..?

ప్రజాప్రభుత్వంలో పేదలకు చేయూత



16లో..

- చేయూత పెన్షన్లతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు
- రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు
- ములుగు జిల్లాలో 4,262 మందికి మంజూరు
- అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం: మంత్రి సీతక్క

ములుగు ప్రభాతవార్త నవంబర్ 16: నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.5 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేయగా, వారిలో 3.5 లక్షల మంది మహిళలే ఉన్నారని తెలిపారు. సోమవారం ములుగు మండలం ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బోర్డ్డే హేమంత్ సహదేవరావుతో కలిసి ములుగు, వెంకటాపూర్ మండలాలు, ములుగు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు..



2వ పేజీలో...

- తనిఖీల పేరుతో పోలీసుల చేతివాటం
- డ్రంక్ అండ్ డ్రైవ్ సాకుతో వాహనదారుడి వద్ద డిమాండ్
- ఎస్ఐ కనుసన్నల్లోనే తతంగం నడుస్తోందని వాహనదారుల ఆరోపణలు

ఎస్ఐ సాక్షిగా వసూల్ దందా..!

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ : శాంతిభద్రతలను కాపాడాల్సిన కొందరు పోలీసులు తనిఖీలపేరుతో వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఏకంగా ఒక ఎస్ఐ సమక్షంలోనే కిందిస్థాయి సిబ్బంది బరితెగించి చేతివాటం ప్రదర్శించడం ఇప్పుడు జనగామలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... జనగామ పట్టణ శివారులోని చిటకోడూరు దారివద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అక్కడ ఉన్న ఎస్ఐ పక్కనే విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లలో ఒకరు చిటకోడూరు గ్రామానికి చెందిన వ్యక్తి (బైకర్)ను ఆపారు. అనంతరం ఆ వాహనదారుడికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ..

విన్నపాలు వింటారా...?



మొదటి పేజీ తరువాయి..

పూర్తి స్థాయి వినియోగానికి నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేడు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో సమావేశం కానున్నారు. గతంలో పలుమార్లు చేసిన విజ్ఞప్తులు, కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన అంశాలు ఈ భేటీలోనైనా ఫలిస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ భేటీ ఫలితాల పైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ములుగు జిల్లా రైతాంగం ఎదురుచూస్తున్నారు.

ముంపు లెక్కలపై పీటముడి..

సమ్మక్క సాగర్ విషయంలో రెండు రాష్ట్రాల మధ్య ప్రధాన వివాదం ముంపు ప్రభావం. తెలంగాణ ప్రభుత్వం బ్యారేజీ పూర్తిస్థాయి నీటినిల్వ మట్టం 83 మీటర్లను ప్రాతిపదికగా చూపుతుండగా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 2022లో నమోదైన భారీ వరదల నేపథ్యంలో 88 మీటర్ల వరకు ఏర్పడే బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతోంది. నీటిమట్టాల్లో ఐదు మీటర్ల వ్యత్యాసం ఉండటంతో ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, గ్రామాలు, ఆస్తుల విలువపై స్పష్టత అవసరమైంది. బీజాపూర్ జిల్లాలోని కొన్ని గ్రామాల పరిధిలో భూములు ముంపునకు గురయ్యే అవకాశాలున్నట్లు అధ్యయనాల్లో వెల్లడైంది. కానీ స్థానికంగా ఉన్న ప్రచారం ప్రకారం చత్తీస్గడ్ రాష్ట్ర పరిధిలో ఉన్న 33 ఎకరాల భూమి మాత్రమే ముంపునకు గురవుతుందని సమాచారం.

పరిహారానికి తెలంగాణ సిద్ధం..

ముంపు సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. సమగ్ర సర్వే కోసం రూ.9.88 కోట్లను చెల్లించినట్లు సమాచారం. ఐఐటీ ఖరగ్‌పూర్ సహకారంతో ముంపు ప్రభావాన్ని అంచనా వేసే ప్రక్రియ చేపట్టింది. ప్రభావిత భూములు, ఆస్తులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు సిద్ధమని స్పష్టం చేసింది. అవసరమైతే పరిహార నిధులను ముందుగానే జమ చేసేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.అయితే ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు కేవలం పరిహారానికే పరిమితం కావడం లేదు. గరిష్ఠ వరదల సమయంలో ఏర్పడే బ్యాక్‌వాటర్ ప్రభావం, ముంపు గ్రామాల భద్రత, భవిష్యత్తులో సంభవించే నష్టాలకు ఎవరు బాధ్యత వహించాలనే అంశాలపై కూడా ఆ రాష్ట్రం స్పష్టత కోరుతున్నట్లు తెలుస్తోంది. అందువల్ల పరిహారం చెల్లిస్తామనే హామీతోనే ఎన్ఓసి సమస్య పరిష్కారమవుతుందా..? అన్నది కీలక ప్రశ్నగా మారింది.

కేంద్రం చొరవ.. మరో అడ్డంకి డీపీఆర్

ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కూడా కీలకంగా మారింది. ఇటీవల సమ్మక్క సాగర్ డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం వెనక్కి పంపినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆయకట్టు వివరాలు, కమాండ్ ఏరియా సర్వే, సాంకేతిక ధ్రువీకరణకు సంబంధించిన అంశాలపై స్పష్టత కోరినట్లు సమాచారం. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి తెలంగాణ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పెండింగ్ అనుమతుల విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర జల సంఘం చైర్మన్‌తోనూ చర్చలు జరిపి అభ్యంతరాలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

రైతుల ఎదురుచూపులు ఎప్పటికి ముగిసేను..?

సమ్మక్క సాగర్ ద్వారా 46.96 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. శ్రీరాంసాగర్ రెండో దశ కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు రామప్ప-పాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రణాళిక ఉంది. దేవాదుల ఎత్తిపోతల పథకానికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. ఇన్ని ప్రయోజనాలు ముడిపడి ఉన్న ప్రాజెక్టు అనుమతుల కోసం ఇంకా ఎదురుచూడాల్సి రావడం రైతుల్లో నిరీక్షణను పెంచుతోంది.

విన్నపాలు వింటారా...?

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తన వాదనలను మరోసారి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ముందు ఉంచనుంది. ముంపు భూములకు పరిహారం, ప్రభావిత గ్రామాల రక్షణ, భవిష్యత్తులో వరదల వల్ల కలిగే నష్టాలపై స్పష్టమైన హామీలు ఇవ్వడం ద్వారా ఇరురాష్ట్రాల మధ్య అవగాహన కుదిరే అవకాశం ఉంది. అయితే ఈ సమావేశంలో చత్తీస్గడ్ రాష్ట్రం నుండి ఎన్ఓసీ జారీకి సూత్రప్రాయ అంగీకారం లభిస్తుందా..? మరిన్ని షరతులు విధిస్తారా..? లేక మరోసారి చర్చలకే పరిమితమవుతుందా..? అన్నది వేచి చూడాలి. ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలకు పరిష్కారం, కేంద్ర జల సంఘం సాంకేతిక అనుమతులు రెండూ కొలిక్కి వస్తేనే సమ్మక్క సాగర్ పూర్తి స్థాయి వినియోగానికి మార్గం సుగమమవుతుంది. రేపటి భేటీ ప్రాజెక్టు భవిష్యత్తుకు కీలక మలుపుగా మారనుంది. సూపర్ ఎల్ ని నో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో నీటి కరువుతో కటకటలాడుతున్న... సమ్మక్క సాగర్ బ్యాక్ వాటర్ లో ఉన్న దేవాదుల ఎత్తిపోతల ద్వారా ఈ సీజన్లో ఇప్పటివరకు సుమారు 20 టీఎంసీల నీరు ఎత్తిపోయటంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "సమ్మక్క సాగర్" కి ఎన్ఓసి సాధనకి వేగంగా అడుగులు వేస్తోంది.

ఎస్ఐ సాక్షిగా వసూల్ దందా..!

మొదటి పేజీ తరువాయి..

నిర్వహించారు. అయితే, "నువ్వు మద్యం సేవించినట్లు మెషీన్‌లో రీడింగ్ చూపిస్తోంది. కేసు ఆన్‌లైన్ చేస్తే కోర్టుకు వెళ్లాల్సి వస్తుంది, భారీగా జరిమానా పడుతుంది. ఇదంతా లేకుండా వదిలేయాలంటే నాకు కొంత ముట్టజెప్పాల్సిందే" అంటూ సదరు కానిస్టేబుల్ డిమాండ్ చేశాడు. కోర్టు చుట్టూ తిరగడం ఎందుకని భావించిన ఆయన, కానిస్టేబుల్ అడిగినంత ముట్టజెప్పి " బతుకుజీవుడా " అంటూ అక్కడే కొద్దిసేపు నిలబడి, పోలీసులు అక్కడనుండి వెళ్లిన తర్వాత ఇంటిబాట పట్టాడు.





- చూసీచూడనట్లు వ్యవహరించిన ఎస్ఐ..:

ఈ వసూళ్ల తతంగం అంతా అక్కడే ఉన్న ఎస్ఐ కళ్లముందే జరిగినా, ఆయన ఏమీ తెలియనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. బాధ్యతాయుతమైన స్థానంలోఉన్న అధికారి పట్టించుకోకపోవడంతో అసలు ఈ వసూళ్లదందా అంతా ఎస్ఐ కనుసన్నల్లోనే జరుగుతోందా...? అంటూ స్థానికులు, వాహనదారులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు

-ఎమ్మెల్యే రామచంద్రునాయక్

మరిపెడ,నవంబర్16,ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) మహబూబాబాద్ జిల్లా ఆరవ మహాసభల పోస్టర్‌ను డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ ఆవిష్కరించారు. డిసెంబర్ 6వ తేదీన మరిపెడ పట్టణంలోని భార్గవ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తులని పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్, జిల్లా ఉపాధ్యక్షులు నామ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి నందిగామ జనార్దనాచారి, మరిపెడ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి దేవులా, సంఘ నాయకులు మంగు, లింగానాయక్, నెహ్రూ, నాగరాజు, గోవర్ధన్, చందు, రత్నాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆరవ మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సంఘ నాయకులు పిలుపునిచ్చారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందిస్తాం

మరిపెడ,నవంబర్16,ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1,218 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణవేణి, మున్సిపల్ చైర్‌పర్సన్ విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, పింఛన్ లబ్ధిదారులు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి సీపీఎస్ రద్దు నిరసనకు ఉద్యోగులంతా తరలిరావాలి

-బానోత్ రవీందర్ నాయక్

బయ్యారం,ప్రభాతవార్త,నవంబర్16:

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 17న నిర్వహించే సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం బయ్యారం మండల అధ్యక్షుడు భానోత్ రవీందర్ నాయక్,ప్రధాన కార్యదర్శి గలిగి దస్తగిరి కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పాత పెన్షన్ హామీని ప్రభుత్వం అమలు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు.ఉద్యోగుల భవిష్యత్తు భద్రతకు పాత పెన్షన్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నవంబర్ 17న మహబూబాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమంలో బయ్యారం మండల ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తావు, మోహన్, సురేష్ రెడ్డి, శ్రీకాంత్ నాయక్, కొలిపాక శ్రీనివాస్, సరిత తదితరులు పాల్గొన్నారు.




చాతి నొప్పిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం..!

-గ్యాస్ సమస్యగా భావించి వైద్యం ఆలస్యం చేయొద్దు

-సకాలంలో ఆసుపత్రికి వెళ్తేనే ప్రాణాలు కాపాడుకునే అవకాశం

బయ్యారం,ప్రభాతవార్త,నవంబర్16:



చాతిలో నొప్పి వచ్చినప్పుడు చాలామంది గ్యాస్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ అదే నొప్పి గుండెపోటుకు సంకేతం కావచ్చని, ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ఇటీవల వార్త రిపోర్టర్ సుమన్ రెడ్డి స్నేహితుడి తల్లికి చాతిలో నొప్పి రావడంతో గ్యాస్ సమస్యగా భావించడంతో చివరకు ఆమె ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన బయ్యారంలో ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. చాతిలో నొప్పి, గుండెలో బిగుతుగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చెమటలు పట్టడం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ముఖ్యంగా గ్యాస్ నొప్పి అనుకుని ఇంటి చిట్కాలు పాటిస్తూ సమయం వృథా చేయకూడదు. ప్రతి చాతి నొప్పి గుండెపోటు కాకపోయినా, గుండెపోటు లక్షణాలను నిర్లక్ష్యం చేయడం ప్రాణాంతకం కావచ్చు. ఆరోగ్యం విషయంలో నిరక్ష్యం ప్రాణాలకే ముప్పు తెస్తుంది. నొప్పి తగ్గుతుందిలే అని ఎదురుచూడకుండా వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో 108కు సమాచారం అందించాలి. డబ్బు, ఆస్తులు తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురాలేం. మన కోసం మన కుటుంబం ఎదురుచూస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోండి. చాతి నొప్పిని నిర్లక్ష్యం చేయకండి.. సకాలంలో వైద్యం పొందండి.. మీ ప్రాణాలను కాపాడుకోండి.

పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాట ఫలితమే జీవో 97 రద్దు

- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

నవంబర్ 16, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:



పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాట ఫలితమే జీవో నెంబర్ 97 రద్దు అని ప్రభుత్వం మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. వరంగల్ లోని పాలిటెక్నిక్ విద్యార్థుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ ప్రెసిడెంట్ బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో జీవో నెంబర్ 97 రద్దుపై సంబరాల కార్యక్రమానికి ఆయన సోమవారం రోజున హాజరయ్యారు. పాలిటెక్నిక్ విద్యార్థులు రేవంత్ సర్కారు అనాలోచితంగా జారీ చేసిన జీవో నెంబర్ 97 రద్దుపై హర్షం వ్యక్తం చేస్తూ టపాసులు కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు చేస్తోందని విమర్శించారు. విద్యార్థుల విషయంలో మరీ ముఖ్యంగా పాలిటెక్నిక్ విద్యార్థుల విషయంలో జారీ చేసిన జీవో నెంబర్ 97 వారి పాలిట శాపంగా మారిందని, అందుకే విద్యార్థి లోకం ఉద్యమించిందని తెలిపారు.విద్యార్థి లోకం ఉద్యమానికి తలొగ్గిన తుగ్లక్ సర్కారు జీవో నెంబర్ 97ను వెనక్కి తీసుకొందని అన్నారు. విద్యార్థి, నిరుద్యోగ లోకాన్ని కాంగ్రెస్ మోసం చేసిందని, వారికి బీఆర్ఎస్ పార్టీ, నాయకులు కేటీఆర్, హరీష్ రావు అండగా ఉంటారని హామీ ఇచ్చారు.ఐటీఐ, ఏటీసీ విద్యార్థుల విషయంలో సైతం ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ విద్యార్థులు పలువురు మాట్లాడుతూ పోరాటానికి అండగా నిలిచిన ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ కి కృతజ్ఞతలు తెలిపారు. పొలిటికల్ గా బీఆర్ఎస్ పార్టీ మా పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమానికి అండగా నిలిచిందని, దానికి రుణపడి ఉంటామని విద్యార్థులు అన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు, ఒత్తిడిలు చేసిన బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ విద్యార్థుల చేసిన ఉద్యమాలకు తోడుగా నిలిచారని కొనియాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి జీవో నెంబర్ 97ను రద్దు చేయడం సంతోషకరం అని అన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పానుగంటి శ్రీధర్, వీరస్వామి, ఉద్యమకారులు తాడిశెట్టి క్రాంతికుమార్, బీఆర్ఎస్వీ నాయకులు పస్తం అనిల్, రాసూరి రాజేష్, యువజన నాయకులు తక్కళ్లపల్లి వినీల్ రావు, ఉదయ్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచకూట శివాలయ వార్షిక కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఇనగాల

నవంబర్ 16, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్: ఆత్మకూరు గ్రామంలోని



కాకతీయ కాలం నాటి చారిత్రక శ్రీ పార్వతీ సమేత మహాదేవ స్వామి పంచకూట శివాలయ ద్వితీయ వార్షిక దివ్యకళ్యాణ మహోత్సవం (కార్తీక శుద్ధ సప్తమి) సోమవారం వైభవంగా జరిగింది. శైవాగమయుక్త ప్రకారంగా శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ శానగొండ శివకిరణ్ శర్మ ఆచార్యత్వంలో జరిగిన ఈ వేడుకలకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఉదయం నుండి ఆలయంలో నిర్వహించిన తదితర ప్రత్యేక వైదిక క్రతువుల్లో ఆయన పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయుల కళావైభవానికి నిదర్శనమైన ఇలాంటి ప్రాచీన ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ పరమేశ్వరుడిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీ ఛైర్మన్, హనుమకొండ కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ మరియు పిఏసిఎస్ ఛైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహా రెడ్డి, ఆత్మకూర్ మండల అధ్యక్షులు రేవూరి జలందర్ రెడ్డి, గ్రామ సర్పంచి పర్వతగిరి మహేశ్వరి, సీనియర్ నాయకులు, వార్డ్ మెంబర్లు మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి నాలుగు రోజుల జైలు

నెక్కొండ, నవంబర్ 16, ప్రభాతవార్త:

మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన బోడ శ్రీను (48)కు నర్సంపేట ప్రత్యేక న్యాయస్థానం నాలుగు రోజుల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధించింది. నవంబర్ 16న న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి పి. రంగనాథచారి ఈ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై జె. శ్రవణ్‌కుమార్ తెలిపారు. అనంతరం నిందితుడిని మహబూబాబాద్ జైలుకు తరలించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

యువకుడిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

నర్మెట, నవంబరు 16 ప్రభాతవార్త :

పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఈనెల 13న ఆగాపేట రోడ్డులోని ఫామ్ ఆయిల్ తోటవద్ద గంజాయిసేవిస్తున్న యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో గంజాయి సేవించినట్లు నిర్ధారణ కావడంతో సోమవారం జిల్లా మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా పునరావాస చికిత్స నిమిత్తం జనగామలోని డి అడిక్షన్ సెంటర్కు యువకుడిని తరలించినట్లు ఎస్ఐ సాగర్ల రఘుపతి తెలిపారు.స

కమలాపూర్ ఎంజేపీ బాయ్స్ పాఠశాలలో అవినీతి ఆరోపణలు..

- ప్రిన్సిపాల్‌పై విచారణకు డిమాండ్

కమలాపూర్ ప్రభాతవార్త: కమలాపూర్ ఎంజేపీ బాయ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ తాడూరి రవీందర్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయనపై సమగ్ర విచారణ జరిపించాలని యువజన కాంగ్రెస్ కమలాపూర్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేశారు.పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిధులను దుర్వినియోగం చేస్తూ నకిలీ బిల్లులు సృష్టిస్తున్నారని, ఉపాధ్యాయులకు ఇచ్చిన చెక్కుల నుంచి తిరిగి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా మెస్ నిర్వహణలో, కాంట్రాక్టుల కేటాయింపులో భారీగా అవకతవకలు జరుగుతున్నాయన్నారు. పాఠశాలలో అడ్మిషన్ల పేరుతో ఒక్కో సీటుకు 30 వేల నుంచి 45 వేల రూపాయల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకం నిధుల వినియోగంలో, విద్యార్థుల కోసం గీజర్ల ఏర్పాటు పేరుతో వసూలు చేసిన డబ్బుల విషయంలో కూడా అక్రమాలు జరిగాయని, పాఠశాల క్వార్టర్స్ లో మద్యం సేవించడం, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో అర్హత లేని సిబ్బందికి ఓటు హక్కు కల్పించడం వంటి అంశాలపై కూడా విచారణ జరపాలని కోరారు.ప్రిన్సిపాల్ నియామకం జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో జరిగిన అన్ని ఆర్థిక, పరిపాలనా వ్యవహారాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి ప్రతి ఆరోపణను ఆధారాలతో విచారించాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై సస్పెన్షన్ తో పాటు కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యాసంస్థల్లో ఇలాంటి అవకతవకలకు తావుండకూడదని, విద్యాసంస్థల పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండ తిరుపతి గౌడ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రిక్కల నారాయణ రెడ్డి, నకిర్త రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకి భద్రత పెంచాలి

- బిసి జాక్ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు

నవంబర్ 16, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎం ఎల్ సి తీన్మార్ మల్లన్న చేపట్టిన రాజ్యాధికార పాదయాత్రలో భాగంగా మోత్కూర్ మండలం అనాజిపురం వద్ద మల్లన్న వ్యక్తిగత వాహనంపై లారీ దూసుకెళ్లి యాక్సిడెంట్ చేసిన ఘటనపై అనుమానాలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, పోలీస్ శాఖ జోక్యం చేసుకొని మల్లన్న కి భద్రత పెంచాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. మల్లన్నని భౌతికంగా హతమార్చడానికి యాక్సిడెంట్ చేసినట్లుగా అనుమానాలు కలుగుతున్న నేపథ్యంలో భద్రత పెంచాల్సిన అవసరం ఉంది అని అభిప్రాయపడినారు. మల్లన్న పాదయాత్రకి ప్రభుత్వం ఎలాంటి పోలీస్ భద్రతను కూడా కల్పించకపోవడం వలన పాదయాత్రలో అనేక అపసృతులు చోటు చేసుకుంటున్నాయి. యాక్సిడెంట్ పై ప్రభుత్వం, పోలీస్ శాఖ సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి అలాగే పాదయాత్రకి పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. మల్లన్న పై దాడి చేయడం అంటే బీసీ సమాజంపై దాడి చేసినట్లుగానే పరిగణిస్తున్నాం కాబట్టి ప్రభుత్వం మల్లన్న వ్యక్తిగత రక్షణకి, పాదయాత్రకి భద్రతను పెంచాలని డిమాండ్ చేశారు. యాక్సిడెంట్ లో మరణించిన చందన కుటుంబాన్ని, గతంలో బీసీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతుందనే ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరా చారి కుటుంబాన్ని, కుమ్మెర మల్లన్న జాతరలో అగ్రవర్ణాల దాడిలో పసి బిడ్డని కోల్పోయిన రజక మహిళని ఆదుకున్న మల్లన్న పై రాజకీయ విమర్శలు చేయటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.

నేరాలు-దారుణాలు



కారులో తరలిస్తున్న పేలుడు పదార్థాలు స్వాధీనం : ఒకరి అరెస్ట్

పరకాల నవంబర్ 16 (ప్రభాతవార్త): పరకాల పోలీసులు కారులో తరలిస్తున్న పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారులో దాదాపు పదివేల పేలుడు పదార్థాలను తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు కరీంనగర్ జిల్లా హుజరాబాద్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సంపంగి శ్రీనివాస్ ను అరెస్టు చేసినట్లు పరకాల సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆదివారం నడి కూడ మండలం ముస్తాలపల్లి గ్రామం వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టగా కారు నెంబర్ టీ ఎస్ 02 ఎఫ్ డి 6665 అడ్డుకోగా పారిపోతుండగా పట్టుకొని పరిశీలించగా ఈ పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు సిఐ వెల్లడించారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా 200 ఐడియల్ పవర్ జిలెటిన్ స్టిక్స్, 375 మీటర్ల సేఫ్టీ ఫ్యూజ్ వైర్,02 తెల్ల రంగు డిటోనేటర్లు లభ్యమయ్యాయని వీటి విలువ సుమారు 10,600 రూపాయలు ఉంటుందని తెలిపారు. హుజురాబాద్ కు చెందిన జున్నోజు రాజేందర్ వద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ కొనుగోలు చేసి నడికూడ కు చెందిన శివరాత్రి ఎల్లయ్యకు అధిక ధరకు అక్రమంగా విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు పేలుడు పదార్థాలతో పాటు కారు, మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని సంపంగి శ్రీనివాస్, జున్నోజు రాజేందర్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వ్యక్తులు జైలుతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు

కాజీపేట్ మండలం(ప్రభాతవార్త) నవంబర్ 16:

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 44 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వ్యక్తులు పట్టుపడగా అందులో(38) ముప్పై మంది డ్రంక్ అండ్ డ్రైవర్ వ్యక్త ల కురూ.47000/ ఫైన్ (06)ఆరుగురు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వ్యక్తుల కు రూ.3000/ఫైన్ వేసినారు (03) ముగ్గురు వ్యక్తులు మొతాదు కు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడగా వారిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుచుగా,(03) వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్సు లను ఒక సంవత్సరం పాటు సస్పెండ్ చేసి ఒక్కొక్కరికి 1000/ చొప్పున ఫైన్ విధించిన సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.రాజశేఖర్ రెడ్డి మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తుల కు జైలు తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడ కాన్సెల్ చేయబడుతుంది ఫైన్ కూడా విధించ బడుతుంది అని కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి.వెంకన్న తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురు అరెస్ట్, రూ.5 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

హసన్‌పర్తి ప్రభాతవార్త: హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంబర్తి గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో పెంబర్తి గ్రామంలోని చకలివాడలో చంద్రగిరి శేఖర్ ఇంటి ముందు బహిరంగ ప్రదేశంలో కొందరు



వ్యక్తులు డబ్బులు పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం మేరకు హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు.పోలీసులను గమనించిన పేకాటరాయుళ్లు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని వెంబడించి ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించిగా పెంబర్తి గ్రామానికి చెందిన చంద్రగిరి శేఖర్ (58),తీగల సమ్మయ్య (59),వల్లాల ఐలయ్య (57),హసన్‌పర్తిలోని కిట్స్ కళాశాల సమీపానికి చెందిన నరిహరి లక్ష్మారెడ్డి (46),హనుమకొండకు చెందిన వేముల రమేష్ (49)గా గుర్తించారు.అనంతరం ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితుల నుంచి రూ.5 వేల నగదు,ఐదు మొబైల్ ఫోన్లు,52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న వస్తువులను చట్టపరమైన చర్యల నిమిత్తం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జూదం,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.



కాటారం మార్కెట్ కమిటీ సమగ్ర అభివృద్ధికి చర్యలు...

- చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య

- రైతులంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలు విక్రయించి మద్దతు ధర పొందాలని సూచన

కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త:





రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో కల్పించాల్సిన మౌలిక వసతులపై పాలకవర్గం పలు కీలక తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు. పంట కోతలు ప్రారంభమైనందున రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను విక్రయించి మద్దతు ధర పొందాలని చైర్‌పర్సన్ కోరారు. వ్యాపారులందరూ విధిగా లైసెన్స్‌లు పొంది అధికారికంగానే కొనుగోళ్లు జరపాలని ఆదేశించారు. యార్డులో రైతు విశ్రాంతి భవనం, విద్యుత్ సెంట్రల్ లైటింగ్, కోల్డ్ స్టోరేజ్ గోడౌన్ల నిర్మాణానికి సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బ్రహ్మారెడ్డి, ఏడీఏ, మార్కెట్ సెక్రటరీ షరీఫ్, డైరెక్టర్లు పిల్లమర్రి రమేష్, తిరుపతిరావు, రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, ఇర్షాద్, సడవలి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

22న మేడారంలో తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర మహాసభ..

- కాటారంలో 5 మండలాల ఉద్యమకారుల సన్నాహక సమావేశం...

- చలో మేడారం పోస్టర్ ఆవిష్కరణ..

- స్థానిక సంస్థల్లో ఉద్యమకారులకు 20 టికెట్లు కేటాయించాలని డిమాండ్

కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త:




ఈ నెల 22న ఆదివారం ములుగు జిల్లా మేడారంలో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం కాటారం మండలకేంద్రంలో కాటారం, మహాదేవపూర్, మహాముత్తారం, మల్హర్ (తాడిచర్ల), పలిమెల మండలాల ఉద్యమకారుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి మండల రవీందర్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పున్నం రవి, జిల్లా నాయకులు పంతకాని సమ్మయ్య, నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్ హాజరై చలో మేడారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో ఉద్యమకారుల హక్కులు, ఆత్మగౌరవం, తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు 20 శాతం టికెట్లు కేటాయించాలని తీర్మానించనున్నట్లు తెలిపారు. కె. కేశవరావు ఆధ్వర్యంలోని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఇకనైనా కాలయాపన చేయకుండా, గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వనదేవతలు సమ్మక్కసారక్కల గద్దపై ఈ సభ నిర్వహించడం హర్షణీయమన్నారు. వారి స్ఫూర్తితో ఉద్యమకారులందరూ తమ హక్కుల సాధనకు కదం తొక్కాలని, కాటారం డివిజన్ నుండి అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి అన్కారి ప్రభాకర్, జేఏసీ కన్వీనర్ పూల్ సింగ్, గణపురం మండల అధ్యక్షులు గుజ్జ గంగాధర్ రావు, కాటారం మండల అధ్యక్షులు చీర్ల తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు వొన్న వంశవర్ధన్ రావు, జె. కరుణాకర్ రావు, జరుపుల రూప నాయక్, బొమ్మ సమ్మిరెడ్డి, మంత్రి రాజబాబు, వి. రామారావు, లింగమల్ల సడవలి రావు, లక్కిరెడ్డి గంగిరెడ్డి, మీర్జా మహ్మద్, కేదారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం మండల ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

- మండల అధ్యక్షుడిగా బొడ్డు అర్జున్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మంతెన సంజయ్ మాదిగ ఎన్నిక

కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త:



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, కాటారం మండల ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాటారం మండల ఇన్చార్జి బెల్లంపల్లి సురేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాంబాబు మాదిగ, రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమోళి మాదిగ, జిల్లా నాయకులు దోర్నాల రాజేందర్ మాదిగ, కాటారం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంతెన మహేష్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి మడిపల్లి నరేష్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. నూతన కార్యవర్గ మండల అధ్యక్షుడుగా బొడ్డు అర్జున్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మంతెన సంజయ్ మాదిగ, ఉపాధ్యక్షుడుగా మంతెన రాఘవ మాదిగ, అధికార ప్రతినిధిగా మామిడి దేవేందర్ మాదిగ, కార్యదర్శిగా నడిగే నరేష్ మాదిగ, కోశాధికారిగా కొట్టపర్తి యశ్వంత్, ప్రచార కార్యదర్శిగా మారపాక సాత్విక్, కార్యవర్గ సభ్యులుగా అన్న నాగేష్, బొల్లి యశ్వంత్, మంతెన శివకుమార్, మంత్రి అక్షయ్, ఆకుల శ్రీధర్ లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ఉద్యమ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు సూచించారు.

కాటారం కేజీబీవీ ఎస్ఓపై చర్యలేవి..?

- జిల్లా ప్రజావాణిలో ఐసా ఫిర్యాదు..

- సిబ్బందిని వ్యక్తిగత పనులకు వాడుకోవడం వివక్షకు నిదర్శనం...

- టేకు చెట్ల నరికివేత, ఎస్ఓ భర్త జోక్యంపై విచారణకు డిమాండ్

- ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదని ఆగ్రహం

కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త:



స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ప్రత్యేక అధికారిణి (ఎస్ఓ) వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జిల్లా కార్యదర్శి బంధు సుజాత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బంధు సుజాత మాట్లాడుతూ.. దీపావళి పండుగకు ముందు కేజీబీవీ సిబ్బందిని ఎస్ఓ తన వ్యక్తిగత ఇంటి పనులకు ఉపయోగించుకున్నారని ఆరోపించారు. కిందిస్థాయి ఉద్యోగులను చులకనగా చూస్తూ, వ్యక్తిగత పనులకు వాడుకోవడం వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. అంతేకాకుండా, గతంలో అభివృద్ధి పనుల పేరుతో పాఠశాల ఆవరణలోని టేకు చెట్లను తొలగించారని, వాటి వివరాలు ఏ రికార్డుల్లో నమోదు చేశారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల వ్యవహారాల్లో ఎస్ఓ భర్త సమయపాలన లేకుండా జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై విచారణ జరపాలని గతంలోనే మండల విద్యాధికారి (ఎంఈఓ)కి వినతిపత్రం ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన ఎస్ఓపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

నిరుద్యోగ యువతకు మంత్రి శ్రీధర్ బాబు అండ..

- పోలీస్ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ...

- ఉచిత కోచింగ్‌తో పాటు ప్రతిరోజూ మధ్యాహ్న భోజన సదుపాయం..

- కష్టపడి చదివి పోలీస్ కొలువులు సాధించాలి...

- విశ్వనాథ్, గణపతి, సువిద్య హైస్కూల్ ప్రిన్సిపల్ కొట్టే శ్రీశైలంల పిలుపు..

కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త:



రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మన ఊరు - మన కోచింగ్ సెంటర్ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. శ్రీ విశ్వ అకాడమీ సహకారంతో పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం కాటారం మండలకేంద్రంలోని సువిద్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు విశ్వనాథ్, గణపతి, సువిద్య హైస్కూల్ ప్రిన్సిపల్ కొట్టే శ్రీశైలం ఈ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతపై ఎలాంటి ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో మంత్రి శ్రీధర్ బాబు ఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. నాణ్యమైన కోచింగ్‌తో పాటు అభ్యర్థులకు ప్రతిరోజూ ఉచితంగా మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. 120 రోజుల పాటు సాగే ఈ శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని దుద్దిళ్ల శ్రీను బాబు సూచించారు. క్రమశిక్షణతో కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించి, తమ తల్లిదండ్రులకు, ప్రాంతానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

తుడుందెబ్బ నేతపై సోషల్ మీడియాలో అసభ్య పోస్టు..

- నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్...

- ఆదివాసీ సమాజాన్ని అవమానించడమేనని భూపాలపల్లి జిల్లా కమిటీ ఖండన..

కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త:

ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్‌పై ఇన్‌స్టాగ్రామ్‌లో అసభ్యకర చిత్రంతో పోస్టు పెట్టిన ఘటనను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు కాటారం సబ్‌డివిజన్ జిల్లా కార్యదర్శి కోట అశోక్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. భూమి, అడవి, హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడిని కించపరచడం యావత్ ఆదివాసీ సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. జనజాతీయ గౌరవ్ దివస్ (బిర్సా ముండా 151వ జయంతి) వేళ ఇలాంటి చర్యకు పాల్పడటం విద్వేషాన్ని రెచ్చగొట్టడమేనని మండిపడ్డారు. నిందితుడిని, వెనుక ఉన్న కుట్రదారులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి, సంబంధిత ఇన్‌స్టాగ్రామ్ ఖాతా, పోస్టును తొలగించాలన్నారు. బాధిత నాయకుడికి చట్టపరమైన రక్షణ కల్పించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ఆధారాలతో (స్క్రీన్‌షాట్‌లు, లింక్‌లు) స్థానిక పోలీస్ స్టేషన్లలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. చట్టబద్ధంగా నిరసన తెలుపుతామని, పోలీసులు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కోట అశోక్ హెచ్చరించారు.



ఆశలకు ఫిక్స్డ్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలి

- డిసెంబర్ 15 నుండి నిరవధిక సమ్మె
- సిఐటియు, బిఆర్టియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

నవంబర్ 16, ప్రభాతవార్త, సుబేదారి :



ఆశాలకు ఫిక్స్డ్ వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, బిఆర్టియు హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట గంటపాటు మహాధర్నా నిర్వహించారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలి ప్రభుత్వ మొండివైఖరి నశించాలి. ఆశాల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశా యూనియన్ గౌరవాధ్యక్షులు సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు రూ.18,000 వేల ఫిక్స్డ్ వేతనం, ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న, అనేక సందర్భాల్లో చలో హైదరాబాద్ , చలో అసెంబ్లీ కార్యక్రమాలు చేసిన సందర్భంగా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వము అధికారులు దానిని అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. ఆశలకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50,000 వేల మట్టి ఖర్చులను వెంటనే నిర్ణయించాలని.రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలి. పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ప్రతి ఆదివారం, పండుగలకు సంవత్సరానికి 20 రోజులు క్యాజువల్, 6 నెలలు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని మరియు ప్రసూతి సెలవులు నిర్ణయించాలి. ఎ.ఎన్.ఎం, జి.ఎన్.ఎం ట్రైనింగ్ చేసిన ఆశాలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలి. 2వ పిఆర్ సిలో ఆశా వర్కర్లకు రూ.30,000 వేల కనీస వేతనం నిర్ణయించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన 2 డిఎలు ఆశాలకు వర్తింపజేయాలి. ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆశలు నిరవధిక సమ్మె చేస్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు చుంచు రాజేశ్వరి, యాకూబీ, బండారి మంజుల, ప్రేమలత, రమాదేవి, కే కల్పన, సిహెచ్ శ్రీవాణి, బైరి శోభ, కవిత, పద్మ సంధ్య, లావణ్య, రజిత శ్రీలత, పుతిలి, కరుణలత, లీల, లతోపాటు ఆశాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఊషూ పోటీల్లో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాల ప్రదానం

- మహిళా క్రీడాకారుల్లో ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ప్రోత్సహించడమే లక్ష్యం
- జిల్లా వెంకటేశ్వర్లు

నవంబర్ 15, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:



మహిళా క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా మహిళా ఊషూ పోటీలు వరంగల్‌లో ఘనంగా నిర్వహించారు. వరంగల్ లో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల నుంచి సుమారు 120 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా సాగాయి. క్రీడాకారిణులు తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన సబ్ జూనియర్ విభాగంలో హనుమకొండ కు చెందిన వెయిట్ కేటగిరీలో 35 కేటగిరిలో గోల్డ్ మెడల్ సాధించిన సిమ్రిత 29 వెయిట్ క్యాటగిరిలో గోల్డ్ మెడల్ సాధించిన కవంతిక 35 కిలోల భాగంలో అశ్విక సిల్వర్ మెడల్ 27.3 కిలోల భాగంలో వర్షిక బ్రాంజ్ మెడల్ 34.1 కిలోల భాగంలో సాన్వితా రెడ్డి బ్రాంజ్ మెడల్‌క్రీడాకారిణులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా వెంకటేశ్వర్లు విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రీడల్లో మహిళలు మరింతగా రాణించాలని ఆకాంక్షి ంచారు. ఇలాంటి పోటీలు యువ క్రీడాకారిణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. చీఫ్ టెక్నికల్ అధికారి, క్రీడా సంఘం చీఫ్ కోచ్ కే. హేమంత్, తెలంగాణ ఊషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. బి. శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షురాలు డా. అరుణ కుమారి మరియు చీఫ్ కోచ్ టి.విశ్వనాథ్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులు ఇలాంటి పోటీల్లో విస్తృతంగా పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఊషూ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాకారిణులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

వివో బిల్లింగ్ పనికి ముగ్గు పోత..

- పాల్గొన్న సర్పంచ్, ఉపసర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులు

కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త :



గ్రామంలో వివో బిల్లింగ్ నిర్మాణ పనికి సోమవారం ముగ్గు పోసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇనుగాల లింగయ్య, ఉపసర్పంచ్ జాగిరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మారెడ్డి, వార్డు సభ్యులు పసుల సురేందర్, గుంటి శ్రీనివాస్, ఇనుగాల సమ్మక్క, బొల్లి లక్షి ్మతో పాటు జాగిరి రాజబాపు, ఐలి శ్రీనివాస్, చినాల మల్లారెడ్డి, శనిగరం వెంకటరెడ్డి, అధికారులు, సిబ్బంది, గ్రామ కార్యదర్శి లక్ష్మి, సీఏ స్వప్న, ఏఈ సతీష్‌లతో పాటు వివో అధ్యక్షురాలు డోంగిరి సాంబలక్ష్మి, వివో కోశాధికారి పసుల నర్సక్క, మేస్త్రి పాగే సత్తయ్య, ననుబోతుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి వీవో భవనం ఎంతో దోహదం...

- మహబూబ్ పల్లి సర్పంచ్ దుర్గం ఈశ్వరి
- మహబూబ్‌పల్లిలో రూ.10 లక్షలతో నూతన వీవో భవన నిర్మాణానికి భూమిపూజ...

మహాముత్తారం, నవంబర్ 16, ప్రభాతవార్త:



మండల పరిధిలోని మహబూబ్‌పల్లి గ్రామంలో వీబీజీ రామ్ జీ పథకం కింద రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన విలేజ్ ఆర్గనైజేషన్ భవన నిర్మాణానికి సర్పంచ్ దుర్గం ఈశ్వరి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి, సభ్యులు తమ సమావేశాలు నిర్వహించుకుని ఆర్థిక కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించడానికి ఈ నూతన భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సీఏ నజ్మా బేగం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుర్గం కిరణ్ కుమార్, వార్డు సభ్యులు పంగ నవీన్, మహిళా సంఘం సభ్యురాలు జిముడ కల్పన, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లను వెంటనే నిర్వహించాలి

- రెండేళ్లుగా నిలిచిన మైనింగ్ స్టాఫ్ బదిలీలు..
- యాజమాన్యం స్పందించాలని ఐఎన్టీయూసీ విజ్ఞప్తి

భూపాలపల్లి టౌన్, నవంబర్ 16, ప్రభాతవార్త: సింగరేణి యాజమాన్యం గత రెండేళ్లుగా మైనింగ్ స్టాఫ్ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లను నిర్వహించకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఐఎన్టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇన్‌ఛార్జి గడిపే చక్రపాణి మాట్లాడారు. గతంలో ఏఐటీయూసీ నాయకులు 2016, 2017 జేఎంఈటీ సూపర్‌వైజర్ స్టాఫ్‌కు ప్రమోషన్లు ఇస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదని ఆయన విమర్శించారు.అండర్ గ్రౌండ్ నుండి ఓపెన్‌కాస్ట్ కు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ల కోసం మైనింగ్ స్టాఫ్ రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారని, ఈ బదిలీలు నిర్వహిస్తే 201617 బ్యాచ్ వారికి వెంటనే పదోన్నతులు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గతంలో 30 ఏళ్ల పాటు సేవలందించి అనారోగ్యానికి గురైన, మోకాలి ఆపరేషన్లు చేయించుకున్న సిబ్బంది సర్వీస్ డ్యూటీలు కోరితే ఏరియా జీఎం సానుకూలంగా స్పందించేవారని, ప్రస్తుతం కార్పొరేట్ ఆఫీసు అనుమతి పేరుతో కాలయాపన జరుగుతోందన్నారు. దీనివల్ల బాధితులు కార్పొరేట్ ఆఫీసు చుట్టూ తిరుగుతూ నెలలో పది డ్యూటీలు కూడా చేయలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే భూపాలపల్లి ఓసీ2లో సిబ్బంది కొరత కారణంగా సూపర్‌వైజర్లు జ్యురిస్డిక్షన్ (పరిధి) మించి విధులు నిర్వహిస్తున్నారని, పీహెచ్‌డీ రోజుల్లోనూ ఓవర్ టైం చేయాల్సి వస్తోందని తెలిపారు. పరిధి మించి పనిచేసే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే మైనింగ్ స్టాఫ్ బాధ్యత వహించాల్సి వస్తుందని, ఈ విషయాన్ని మైనింగ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. యాజమాన్యం స్పందించి వెంటనే రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్లు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ రఘుపతి రెడ్డి, జోగా బుచ్చయ్య, డిప్యూటీ సెక్రటరీలు పసునూటి రాజేందర్, రత్నం సమ్మిరెడ్డి, సెంట్రల్ నాయకులు నరేష్ల సంపత్, చేరాలు, బొడ్డు అశోక్, షేక్ హుస్సేన్, శంకర్, రవికిరణ్, మైనింగ్ స్టాఫ్ ఉయ్యాల హుస్సేన్, శ్రీధర్, కి.శ్రీనివాస్, కరుణాకర్, సురేష్, గణేష్, పిట్ సెక్రటరీలు సోతుకు సమ్మయ్య, లక్షీ ్మనారాయణ, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప, అరుణాచలం భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- భక్తుల ఇంటి వద్దకే ఆర్టీసీ బస్సు సౌకర్యం
- కార్తీక మాస యాత్రలకు భూపాలపల్లి డిపో ప్రత్యేక బస్సులు

భూపాలపల్లి టౌన్ ,నవంబర్ 16, ప్రభాతవార్త: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడిపించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని భూపాలపల్లి డిపో మేనేజర్ చేరాల మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామ క్షేత్రాలు, అరుణాచలం యాత్రలతో పాటు అయ్యప్ప మాలధారణ చేసిన భక్తుల కోసం ప్రత్యేక అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంచారామ క్షేత్రాలు, అరుణాచలం యాత్రలకు వెళ్లే భక్తులు 36 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది బృందంగా ఉంటే, వారి ఇంటి వద్దకే బస్సును పంపించే సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులు కోరుకున్న యాత్రా మార్గం, ప్రయాణ ప్రణాళికకు అనుగుణంగా బస్సులను కేటాయించనున్నామని, ప్రయాణం సురక్షి తంగా, సౌకర్యవంతంగా సాగేందుకు అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలు, బస్సుల బుకింగ్ కోసం డిపో మేనేజర్ (9959226707), సీఐ (9866373825), లేదా భూపాలపల్లి బస్టాండ్ (7382854256) నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలి..

- బహుమతులు అందజేసిన ఉప సర్పంచ్ చెమ్మల సుధీర్ కుమార్

మహదేవపూర్ , నవంబర్ 16, ప్రభాతవార్త: మహదేవపూర్ మండలం



కాళేశ్వరం ఎంపీపీఎస్ మజీద్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కాళేశ్వరం ఉప సర్పంచ్ చెమ్మల సుధీర్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. చదువుతోపాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందజేయడం ఆనందంగా ఉందని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. రజిత, ఉపాధ్యాయులు శిరీష, నీరజ తదితరులు పాల్గొన్నారు.







నిమోనియాపై అప్రమత్తం.. వైద్య సిబ్బందికి శిక్షణ

ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల తగ్గింపునకు ప్రత్యేక శిక్షణ
వైద్యాధికారులు, హెల్త్ ప్రొవైడర్లకు అవగాహన కార్యక్రమం

ములుగు ప్రభాతవార్త, నవంబరు 16:

ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను తగ్గించేందుకు నిమోనియా నివారణ, ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్సపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సోమవారం ములుగు ఐడీఓసీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెయ్యి సజీవ జననాలకు ముగ్గురు నవజాత శిశువుల మరణాల స్థాయిని సాధించడమే కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. నిమోనియా నివారణ, రక్షణ చర్యలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో తల్లిదండ్రులు, సంరక్షకులకు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారుల్లో వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో ప్రాథమిక చికిత్స అందించాలని, టీకాలు, పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించాలని తెలిపారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను వందశాతం సాధించాలని, నిరక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగ అనేష్ నిమోనియా నివారణ, నియంత్రణ చర్యలపై శిక్షణ ఇచ్చారు.

మరోవైపు ములుగు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలకు సాస్ కార్యక్రమం లక్ష్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీడియాట్రిషియన్ ప్రొఫెసర్ సుధాకర్ నాయక్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రవితేజ, మాస్ మీడియా అధికారి సంపత్, జీజీహెచ్ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ అనిల్, జిల్లా మానిటరింగ్ సూపర్‌వైజర్ సురేష్‌బాబు, వైద్యాధికారులు, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, హెల్త్ ప్రొవైడర్లు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

జంగాలపల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏడుగురు అరెస్ట్.. రూ.3,500 నగదు, మూడు బైకులు స్వాధీనం

ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త నవంబర్ 16:

ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జంగాలపల్లిలో అక్రమంగా పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు సోమవారం సాయంత్రం దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సాయంత్రం 5 గంటల సమయంలో ఎస్సై ఎస్. వెంకటేశ్ పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారు పీరే..తప్పట్ల నవదీప్,తప్పట్ల వంశీ,గంగాధర్,బలిగురి రవీందర్, కోడిపుంజుల వినోద్ కుమార్, కోవూరి లక్ష్మణ్,బల్లని రవి.

నగదు, వాహనాలు స్వాధీనం.

నిందితుల నుంచి రూ.3,500 నగదు, పేకాట ముక్కలతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏడుగురిని ములుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతం చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సందడి నింపాలి.. కలెక్టర్లకు మంత్రి, సీఎస్ దిశానిర్దేశం
కలెక్టరేట్లలో కౌంట్‌డౌన్ బోర్డులు
ప్రధాన కూడళ్లలో మస్కట్ సెల్ఫీ పాయింట్లు

ములుగు ప్రభాతవార్త నవంబర్ 16:

తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026ను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. క్రీడా పోటీలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో ఆసక్తి పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, యువజనాభివృద్ధి, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎనిమిది జిల్లాల్లోని 20 వేదికలపై వివిధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం ప్రతిష్ఠాత్మకమని, ఈ క్రీడా వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రీడల





లోగో, మస్కట్‌తో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. క్రీడలు జరిగే జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల్లోనూ ప్రజలు, విద్యార్థులు, యువత భాగస్వాములయ్యేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, పార్కులు, ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో లోగో, మస్కట్‌తో కూడిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్లలో కౌంట్‌డౌన్ బోర్డులు, ప్రధాన కూడళ్లలో మస్కట్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా యువజన, క్రీడల అధికారి ధర్మానాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై నిరక్ష్యం వద్దు!

ప్రతి అర్జీని బాధ్యతగా పరిష్కరించాలి
జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు
అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం
ప్రజావాణికి 22 వినతులు
అత్యధికంగా భూ సమస్యలపై 7 దరఖాస్తులు

ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో, ప్రభాతవార్త, నవంబర్ 16:



ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. పరిష్కరించగల సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. అర్జీదారులకు తమ దరఖాస్తుల పరిష్కార స్థితిని తెలియజేయాలని స్పష్టం చేశారు.

భూ సమస్యలపైనే అధిక వినతులు..

సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 22 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 7, ఇందిరమ్మ ఇళ్ల కోసం 2, పింఛన్లకు సంబంధించి 4, ఇతర శాఖలకు సంబంధించినవి 9 ఉన్నాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
జిల్లా ఆత్మ కమిటీ అధ్యక్షులు చిటమట రఘు

ప్రభాతవార్త ఏటూర్ నాగారం నవంబర్ 16:

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. మండలంలోని గోగుపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా ఆత్మ కమిటీ అధ్యక్షులు చిటమట రఘు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కునూరు అశోక్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు .రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కునూరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్, ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, మండల ఆత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బాక రాకేష్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగబండ రవి, శివాపురం ఉపసర్పంచ్ వంగపండ్ల సరిత, మండల నాయకులు, రైతులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాత పెన్షన్ హక్కుకై పోరాటం..

వెంకటాపురం సిపిఎస్ ఉద్యోగుల సంఘం
సామూహిక సెలవు కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం

వెంకటాపురం,ప్రభాతవార్త

పాత పెన్షన్ విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని వెంకటాపురం సిపిఎస్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు బోదే బోయిన జయరాం స్థానిక ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు అన్ని శాఖల ఉద్యోగులు సామూహిక సెలవులు పెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ భద్రతకోసం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి ఉద్యోగస్తులు స్వచ్ఛందంగా సామూహిక సెలవులు పెట్టి నిరసన ఐక్యతను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు.

పిల్లల మాటకు విలువ ఇద్దాం.. వారి అభిప్రాయాలను గౌరవిద్దాం..

జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు.

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా పిల్లల ప్రజావాణి.

జిల్లావ్యాప్తంగా 32 వినతులు.. విద్యార్థులతో ముఖాముఖిగా కలెక్టర్.

ములుగు ప్రభాతవార్త నవంబర్ 16:

బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారంతో పాటు అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యంగా ములుగు జిల్లాలో ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఖినా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్‌ఖి నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు విద్యార్థుల నుంచి వినతులు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలల్లో, నివాస ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వారి అభిప్రాయాలను శ్రద్ధగా విని వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిల్లో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇతర శాఖల అధికారులు సమస్యలను పరిశీలిస్తారని, జిల్లా స్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు పరిష్కార చర్యలు చేపడతారని వివరించారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వ అనుమతుల కోసం రాష్ట్ర స్థాయికి పంపిస్తామని



విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాలల్లో లేదా నివాస ప్రాంతాల్లో ఎదుర్కొనే సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. పిల్లల ప్రజావాణిలో అందిన వినతులను పరిశీలించి, జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలపై చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

32 దరఖాస్తుల స్వీకరణ..

జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పిల్లల ప్రజావాణిలో మొత్తం 32 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని 10 మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా 22, జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి ద్వారా మరో 10 దరఖాస్తులు స్వీకరించారు. పిల్లలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా తమ సమస్యలను వెల్లడించేందుకు ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత, డీఎస్పీ కిషోర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ ఏ. రమాదేవి, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానకు తాళం.. రోగులకు వైద్యం కరువు!

మధ్యాహ్నం ఒంటిగంటైనా తెరుచుకోని ఆసుపత్రి.. వైద్యులు, సిబ్బంది ఎక్కడ?

జిల్లా స్థాయి సమావేశం ఉంటే ప్రజలకు వైద్యం ఎవరు అందించాలి?



గోవిందరావుపేట, ప్రభాతవార్త:

పేద ప్రజలకు గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పరిధిలోని ప్రాజెక్ట్‌నగర్ పల్లె దవాఖాన ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట దాటినా ప్రాజెక్ట్‌నగర్ పల్లె దవాఖాన తలుపులు తెరుచుకోలేదు. విధులకు హాజరుకావాల్సిన వైద్యాధికారితో పాటు ఏఎన్ఎం, స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది ఎవరూ ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులకు నిరాశే ఎదురైంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలు ఎక్కడికి వెళ్లాలంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎంహెచ్ఓ ఆగ్రహం..

సిబ్బందిపై విచారణ!

ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) గోపాలరావును చరవాణి ద్వారా వివరణ కోరగా, జిల్లా స్థాయిలో సమావేశం ఉండటంతో ప్రాజెక్ట్‌నగర్ పల్లె దవాఖానకు చెందిన వైద్యాధికారిని సమావేశానికి హాజరయ్యారని తెలిపారు. అయితే వైద్యాధికారిణి సమావేశానికి వెళ్లినంత మాత్రాన ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది ఆసుపత్రిలోనే ఉండి వైద్యం కోసం వచ్చే ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.ఆసుపత్రికి తాళం ఎందుకు వేశారు.? విధుల్లో లేని సిబ్బంది ఎక్కడ.? అనే అంశాలపై సంబంధిత వైద్యాధికారిని, విధులకు హాజరుకాని స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను విచారణ చేస్తామని డీఎంహెచ్ఓ తెలిపారు. విధుల్లో నిరక్ష్యం వహించినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన సిబ్బంది ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు.

సమావేశాల పేరుతో వైద్య సేవలకు విరామమా.?

జిల్లా స్థాయి సమావేశాలు ప్రభుత్వ పాలనలో భాగమే కావచ్చు. కానీ సమావేశాల కారణంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల పేద ప్రజలకు వైద్యం అందకుండా పోవడం ఎంతవరకు సమంజసం.? వైద్యాధికారిణి సమావేశానికి వెళ్లినప్పుడు మిగతా సిబ్బంది ఆసుపత్రిలో ఉండి వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత లేదా? ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యం అందించడం ప్రథమ ప్రాధాన్యత కావాలి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో పల్లె దవాఖానాలే పేద ప్రజలకు ప్రధాన వైద్య ఆధారం.

జిల్లా వైద్యాధికారి .. ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేనా.?

ప్రాజెక్ట్‌నగర్ పల్లె దవాఖానలో జరిగిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలి. ఆసుపత్రి పని వేళల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు విధులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అధికారులు ఇచ్చే ఆదేశాలు కేవలం ఫోన్ సంభాషణలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలుకావాలి. పేద ప్రజల ఆరోగ్యంతో నిరక్ష్యంగా చేసే పరిస్థితులకు తావివ్వకూడదు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే పల్లె దవాఖానాలు నిత్యం తెరిచి

ఏటూర్‌నాగారం వార్త

గిరిజన విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



ప్రభాతవార్త ఏటూరునాగారం, నవంబర్ 16:

గిరిజన విద్యార్థుల్లో విద్యా తో పాటు సృజనాత్మకత, కళలు, క్రీడా నైపుణ్యాలు, పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఐటీడీఏ ఏటూరునాగారం ప్రత్యేకంగా చేపట్టిన క్లబ్ కార్యకలాపాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు చక్కటి వేదికగా నిలుస్తున్నాయని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ అన్నారు చిల్డ్రన్స్ డే వేడుకలు-2026 సందర్భంగా ఐటీడీఏ స్థాయిలో నిర్వహించిన క్లబ్ కార్యకలాపాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ పోటీల్లో మొదట పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు, అనంతరం జిల్లా స్థాయిలో పోటీపడి, చివరగా ఐటీడీఏ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని పాఠశాలల నుంచి వివిధ దశల్లో పోటీపడి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి, ఐదు క్లబ్‌లలో ఒక్కో క్లబ్‌కు ఒక్కో విజేత చొప్పున ప్రథమ బహుమతులు అందజేశారు.

ఐదు క్లబ్‌లలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు:1. లిటరరీ క్లబ్: జి. ప్రియాంక - బాలికల ఆశ్రమ పాఠశాల , ఏ.కె. ఘన్‌పూర్.

2. ఆర్ట్ !! కల్చర్ క్లబ్: ఈ. అంకిత - బాలికల ఆశ్రమ పాఠశాల చిరుతపల్లి ॥.

3. స్పోర్ట్స్ !! ఫిట్‌నెస్ క్లబ్: బి. అక్షర బాలికల ఆశ్రమ పాఠశాల మేడారం.

4. ఎకో క్లబ్: బి. రిషిత బాలికల ఆశ్రమ పాఠశాల ఏ.కె. ఘన్‌పూర్.

5. సైన్స్ !! టెక్నాలజీ క్లబ్: కె. జశ్విక బాలికల ఆశ్రమ పాఠశాల తాడ్వాయి. బహుమతులు అందుకున్నారు

ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సాహిత్యం, కళలు, క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి రంగాల్లోనూ ఆసక్తి పెంపొందించుకోవాలని, తమలోని నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇలాంటి వేదికలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు పునాది వేస్తాయని పేర్కొన్నారు.గిరిజన విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు వారి ఆసక్తులు, అభిరుచులు, ప్రత్యేక నైపుణ్యాలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇలాంటి క్లబ్ కార్యకలాపాలను మరింత విస్తృతంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏపీవో జి. ప్రతాప్, ఏవో ఏ. అనిల్ కుమార్, డిడి జనార్ధన్, డిప్యూటీ డిఇఓ వీరులాల్, ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధరావత్ రాజు, ఎ సి ఎం ఓ వాగ్య, రవీందర్, ఎస్ ఓ యాలం ఆదినారాయణ, శ్యామలతతో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

లక్ష్మీ మ్మదేవిపేట పీఏసీఎస్ చైర్మన్ గా సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క

వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త నవంబర్ 16:

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. సోమవారం లక్ష్మీ మ్మదేవిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ గా సూర్యనారాయణ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లక్ష్మీ మ్మదేవిపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో నూతన చైర్మన్ సూర్యనారాయణ, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు వారికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం రుణమాఫీ. రైతు భరోసా, రైతు బీమా,ఉచిత విద్యుత్ అందిస్తోంది. పీఏసీఎస్ ల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు సకాలంలో అందాలనీ. సూర్యనారాయణ రైతులకు అందుబాటులో ఉండి, అవినీతి లేకుండా సంఘాన్ని నడపాలనీ సూచించారు. పీఏసీఎస్ అంటే రైతుల బ్యాంకు అని, ప్రతి రైతుకు రుణ సౌకర్యం అందేలా చూడాలని ఆమె కోరారు. అనంతరం నూతన చైర్మన్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. "నాపై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన మంత్రి సీతక్క గారికి, రైతులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు. లక్ష్మీ మ్మదేవిపేట పీఏసీఎస్ ను రైతులకు అండగా నిలిచేలా నడుపుతాననీ, ఎరువులు, విత్తనాల పంపిణీలో



పారదర్శకత పాటిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- రెవెన్యూ డివిజనల్ అధికారి డిఎస్.వెంకన్న

పరకాల నవంబర్ 16 (ప్రభాతవార్త):

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీక రించిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి డి ఎస్. వెంకన్న అధికారులను ఆదే శించారు. సోమవారం రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వివరిస్తు దర ఖాస్తులు సమర్పించారు. బాలల ప్రజావాణి 10,ప్రజల నుంచి 05 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దని, ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్క రించాలని సూచించారు.దరఖాస్తుదారులకు సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందేలా



అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పరకాల పట్టణంలోని భవాని కుంకుమేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆర్డిఓ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరిస్తే సహించేది లేదు

- ఎన్నికల హామీలను అమలు చేయాలి

- ఉద్యమకారుల మండల అధ్యక్షుడు దామెర మొగిళి

పరకాల నవంబర్ 16 (ప్రభాతవార్త):



త్యాగం చేశామని, ఉద్యమ సమయంలో అనేక కేసులు, పోలీసుల దాడులు, జైలు జీవితాలను ఎదుర్కొన్నామని తెలంగాణ ఉద్యమకారుల పరకాల మండల అధ్యక్షుడు దామెర మొగిళి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులను నేడు రాజకీయ పార్టీలు విస్మరించడం దారుణమని మండిపడ్డారు. కేసీఆర్ 2001లో ప్రారంభించిన మలిదశ ఉద్యమం నుంచి రాష్ట్ర సాధన వరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నామని, రోడ్డు రోకోలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశామని గుర్తుచేశారు.ఉద్యమకారులపై కేసులు పెట్టి, పోలీసుల దాడులకు గురిచేసి, జైళ్లకు పంపినా తెలంగాణ సాధనే లక్ష్యంగా వెనక్కి తగ్గకుండా పోరాటం కొనసాగించామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు సముచిత గౌరవం, గుర్తింపు, ఆర్థిక భరోసా లభిస్తాయని ఆశించామని తెలిపారు. అయితే నేటికీ అనేక మంది ఉద్యమకారులు తమకు రావాల్సిన న్యాయం కోసంఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల త్యాగాలను ఎన్నికల సమయంలో గుర్తుచేసుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం రాజకీయ పార్టీలకు తగదన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యమకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని కోరారు.ఉద్యమకారులను నిరక్ష్యం చేస్తూ కాలయాపన చేస్తే కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్రను చరిత్ర ఎప్పటికీ మరచిపోదని, వారి త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం అవసరమైతే మరోసారి పోరాటానికి సిద్ధమని దామెర మొగిళి ఆ ప్రకటనలో తేల్చిచెప్పారు.

ఈ నెల 22న ఓరుగల్లుకు కేటీఆర్ రాక

- ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

నవంబర్ 16, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :

ఈ నెల 22న మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హనుమకొండ కి రానున్నట్లు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో సోమవారం మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ శాసనసభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామా రావు ఈ నెల 22న హనుమకొండ పట్టణానికి రానున్నట్లు తెలిపారు. వారి రాక సందర్భంగా నగరంలో ఒక సభ నిర్వహణకు నిర్ణయించారు. సభ ఏర్పాట్లు, జనసమీకరణ, ట్రాఫిక్ నియంత్రణ, సభ సంబంధించిన ఇతర ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. సభకు సంబంధించిన ఏర్పాట్లపై కమిటీలను ఏర్పాటు చేశారు.పార్టీలో చేరికలపై సైతం చర్చించారు. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల, స్టేషన్ ఘన్‌పూర్ పరిధిలోని పార్టీ శ్రేణులు ఈ సభకు పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు



తెలిపారు. సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య , మాజీ శాసనసభ్యులు చల్ల ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకన్న, మర్రి యాదవ రెడ్డి, చింతం సదానందం, రమేష్ బాబు, మాజీ కార్పొరేటర్లు వద్దిరాజ్ గణేష్, జోరిక రమేష్, సీనియర్ నాయకులు నిమ్మగడ్డ వెంకన్న, శోభన్, మసూద్, నయీమొద్దీన్, నీలం రాజ్ కిషోర్, పోలపెల్లి రామ్మూర్తి , ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

హసన్‌పర్తి మండలంలో పిల్లల ప్రజావాణి కార్యక్రమం

హసన్ పర్తి, నవంబర్ 16, ప్రభాతవార్త:

పిల్లల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం హసన్‌పర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి వారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా పాఠశాల ముందు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోందని, విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ ప్రజావాణి కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పిల్లలకు ఇంట్లో, పాఠశాలలో లేదా సమాజంలో ఎక్కడైనా సమస్యలు ఎదురైనా, ఇతరుల నుంచి



వేధింపులకు గురైనా ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేసి తగిన రక్షణ పొందవచ్చని తెలిపారు. అంతేకాకుండా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను విద్యార్థులకు పరిచయం చేస్తూ, ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించారు. పిల్లలు తమ సమస్యలను ధైర్యంగా అధికారులకు తెలియజేయాలని, తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నుమనవాణి, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆకునూరి మహేందర్, పాఠశాల ఉపాధ్యాయులు నితిన్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



ఔషధాల బాధ్యతాయుత వాడకంపై అవగాహన

ఎడ్యుకేషన్ కేయు నవంబర్ 16 ప్రభాతవార్త:



జనగాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, జనగామలో సోమవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని వేడుకలను పురస్కరించుకొని ఆంటీ మైక్రోబియన్ నిరోధకత, యాంటీబయాటిక్ నిరోధకత ఔషధాల బాధ్యతాయుత వినియోగం, మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు ఫార్మసిస్టుల సామాజిక బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య గాదే సమ్మయ్య మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. టి బి డ్రగ్ రెస్టారెంట్స్ వస్తుంది కనుక మల్టీ డ్రగ్ తెరపి ఇవ్వడం జరుగుతుందనీ రైట్ మెడిసిన్, రైట్ డోస్, రైట్ టైం లో, రైట్ పర్సన్ కు అందించినచో సంపూర్ణంగా పేషంటు నయమయ్యే అవకాశం ఉంటుందని వైద్యుల సూచన లేకుండా యాంటీబయాటిక్ ఆంటీ మైక్రోబియల్ వంటి మందులను ఉపయోగించడం వల్ల యాంటీ మైక్రోబియల్ యాంటీబయాటిక్ నిరోధకత పెరిగి భవిష్యత్తులో సాధారణ ఇన్ఫెక్షన్లకు కూడా చికిత్స చేయడం కష్టతరమవుతుందని వివరించారు. "యాంటీబయాటిక్స్‌ను వివేకంతో ఉపయోగించండి – వాటి శక్తిని భవిష్యత్తు తరాల కోసం కాపాడండి. మాదకద్రవ్యాలకు నో చెప్పండి – ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి" అనే నినాదంతో ముగించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ బి విజయకుమార్ డాక్టర్ లవ కుమార్ రెడ్డి అధ్యాపకులు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

సుజిత్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



- 120 మందికి వైద్య పరీక్షలు..

- ఉచితంగా వైద్య సేవలు

సుబేదారి నవంబర్ 16 ప్రభాతవార్త:

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా హనుమకొండ 31వ డివిజన్ పరిధిలోని సుజిత్ నగర్‌లో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆదేశాల మేరకు స్మార్ట్ ఐస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ శిబిరంలో సుజిత్ నగర్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 120 మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించారు. స్థానికులకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీసీసీ సభ్యుడు మామిండ్ల సురేష్, మండల కార్యదర్శి ఓరుగంటి సమ్మయ్య, ప్రభాకర్, సుధాకర్, సాంబయ్య, వెంకన్నతో పాటు పలువురు కాలనీవాసులు, పెద్దలు పాల్గొన్నారు.

కార్తీక మాసం కోటి సోమవారం శివుడికి పూజ చేస్తే కోటి రెట్ల పుణ్యఫలమట

కాజీపేట మండలం(ప్రభాతవార్త) నవంబర్ 16: కాజీపేటలోని స్వయంభు శ్రీ శ్వేతార్కమూల గణపతి దేవాలయంలో సోమవారం కార్తీక మాసం, కోటి సోమవారం, శ్రవణా నక్షత్రం సందర్భంగావిశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో కొలువై ఉన్న సంతాన నాగలింగేశ్వర స్వామివారికి, స్వయంభు శ్రీ శ్వేతార్కమూల గణపతి స్వామివారికి, శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తోమాల సేవలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు దివ్యదర్శనం కల్పించారు.కార్తీక సోమవారం పవిత్రతను పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివారాధనకు అత్యంత విశిష్టమైన కార్తీక సోమవారం రోజున అభిషేకాలు, దీపారాధనలు నిర్వహించడం వల్ల శివానుగ్రహం, కుటుంబ శ్రేయస్సు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.అలాగే ఆలయంలోని శ్రీ సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో పలువురు భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు.

రాయపర్తిలో చేయూత పెన్షన్ల జాతర

- 940 మందికి పెన్షన్లు పంపిణీ

- వరంగల్ జిల్లాలోనే నెంబర్ వన్ రాయపర్తి...

రాయపర్తి, ప్రభాతవార్త నవంబర్ 16:

రాష్ట్రవ్యాప్తంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులకు చేయూత పెన్షన్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. రాయపర్తి మండల హెడ్ క్వార్టర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు అందజేశారు.రాయపర్తి మండలంలో మొత్తం 940 మంది పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పెన్షన్ మంజూరు చేసింది. ఇందులో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతో పాటు చేనేత కార్మికులకు కల్లుగీత కార్మికులకు, పెన్షన్లు అందించడం విశేషం. వరంగల్ జిల్లాలోనే రాయపర్తి మండలంలో అత్యధికంగా పెన్షన్లు మంజూరు కావడం జరిగిందని ఎంపీడీవో గారు ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ... "కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షపాతే.



సన్నబియ్యం, ఉచిత కరెంటు, చేయూత పెన్షన్లు, ఫ్రీ బస్సు, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ప్రతిదీ పేదల గురించి ఆలోచించే ప్రజా ప్రభుత్వం మన కాంగ్రెస్ ప్రభుత్వం. సన్నబియ్యం ఇస్తున్న ప్రభుత్వం మన రేవంత్ రెడ్డి ప్రభుత్వమే" అని తెలియజేశారు.గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె ఘాటుగా స్పందిస్తూ... "టీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చిందా? పేదల కష్టాలు పట్టించుకుందా? ఇప్పుడు మన ప్రభుత్వం ప్రతి అర్హుడికి పెన్షన్, రేషన్, సన్నబియ్యం అందిస్తోంది" అని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పైడిపల్లి వాసికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా రత్న అవార్డు

వరంగల్ సిటీ నవంబర్ 16 ప్రభాతవార్త: వరంగల్ నగరం పైడిపల్లి గ్రామానికి చెందిన జన్ను హరిబాబు చేసిన సేవలకు గాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవా రత్న అవార్డు పొందారు.ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవారత్న అవార్డును ఉప్పల్ శాసనసభ సభ్యులు బండారి లక్ష్మా రెడ్డి చేతుల మీదుగాఅందుకున్నరు. జెకె డాన్స్ గ్రూప్ అధ్యక్షులు, సోషల్ యాక్టివిటీస్, అరుంధతి కల్చరల్ ఫౌండేషన్ సహాయ కార్యదర్శిగా ఎంతో సేవలు చేసినందుకు గాను జన్ను హరిబాబు ను వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వి ఆర్ శ్రీనివాస్ రాజు వారి సంస్థ శ్రీ ప్రగతి ఫౌండేషన్ నుంచి ఈ ప్రదానం చేశారు.ఈ సందర్భంగా శ్రీ ప్రగతి ఫౌండేషన్ కు, వల్లూరు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ రాజు కు కృతజ్ఞతలు తెలియజేశారు. గత 25 సంవత్సరాలుగా కళమ్మ తల్లిని నమ్ముకుని ఒక కళాకారుడిగా చైతన్య పరచి, అనేకమందికి జెకె డాన్స్ గ్రూప్ ద్వారా అనేక మంది కళాకారులను తయారు



చేసి అనేక సేవా కార్యక్రమాలు చేసిన జన్ను హరిబాబు కు తగిన గుర్తింపు వచ్చిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సికేఎం ఆసుపత్రిలో బిక్షాటన చేసిన కాంట్రాక్టు కార్మికులు

వరంగల్ సిటీ నవంబర్ 16 ప్రభాతవార్త:

వరంగల్ సికేఎం ఆసుపత్రి లో కాంట్రాక్టు కార్మికులు జీతాలు పెంచాలని బిక్షాటన చేశారు. ఎఐటియుసి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శి కలకోట్ల రాజు, నాగవెల్లి శంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, కాంట్రాక్టు కార్మికులతో కలిసి 5 వ రోజు నిరసనలో భాగంగా భిక్షాటన నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పాల్గొని మాట్లాడారు.షప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నేటికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు.ఆసుపత్రి లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులందరినీ వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. నెలకు కనీసం రూ.26,000 వేతనం చెల్లించాలి. జాతీయ పండుగ సెలవులతో పాటు సంవత్సరానికి 25 రోజుల ఆర్జిత సెలవులు కల్పించాలి. బోనస్ , ఉద్యోగ



భద్రత, కనీస సౌకర్యాలు, చట్టబద్ధమైన కార్మిక హక్కులను ఈ నెల 28వ తేదీలోపు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు దడిగెల సంధ్యారాణి, లావణ్య, వరలక్ష్మి , ప్రవర్ధన్, కావ్య, రాము ,మాధవి, సిహెచ్ స్వరూప, సుమతి, జ్యోతి, రఘు, వంశీ, దేవేందర్ ,కమలాకర్, ఎలీషా, స్వరూప, రవీందర్ ,రాజు, శంకర్, సక్కుబాయి, శోభ ,రఘు, వంశీ, కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

బొల్లికుంటలో బాలల హక్కుల దినోత్సవం

- బాలల సమస్యల పరిష్కారానికే ప్రత్యేక ప్రజావాణి

- ఐసీడీఎస్ సూపర్వైజర్ బాల్నే పద్మావతి

ఖిలా వరంగల్ నవంబర్ 16 ప్రభాతవార్త:

పుట్టిన ప్రతి బిడ్డకు జీవించే హక్కు తగిన ఆహారం మంచి ఆరోగ్యం వైద్య సదుపాయాలు పొందే, మనుగడ హక్కు, రక్షణ హక్కు అభివృద్ధి హక్కు భాగస్వామ్య హక్కు లతోపాటు విద్యా హక్కు చట్టం ఫోక్స్కో చట్టం చైల్డ్ లైన్ మొదలగు బాలల హక్కుల పై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ బాల్నే పద్మావతి అన్నారు. సోమవారం బొల్లికుంట జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వారోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మామనూర్ సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ బాల్న పద్మావతి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు బాలల హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు హింస వేధింపులు బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు అక్రమ రవాణా నుండి పిల్లలను రక్షి ంచుకునే హక్కు ప్రతి బిడ్డ శారీరక మానసిక నైతిక భౌతిక వికాసానికి అవసరమైన విద్య ఆటపాటలు విజ్ఞాని పొందే హక్కులు ఉన్నాయని వివరించారు. పిల్లలు



పిల్లలకు సంబంధించిన విషయాలలో తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలిపే హక్కు ఉంటుందని తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాల వయసుగల పిల్లలకు నాణ్యమైన ప్రాథమిక విద్యను అందిస్తుందని, ఫోక్స్ కు చట్టం పిల్లలపై జరిగే లైంగిక వేధింపులు నేరాల నుండి రక్షణ కల్పిస్తుందని ఆపదలో ఉన్న పిల్లలని ఆదుకోవడానికి ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 1098 అందుబాటులో ఉంటుందని ఈ సదవకాశాన్ని చిన్నారులు వినియోగించుకోవాలని కోరారు అంతేకాకుండా ప్రతి సంవత్సరం నవంబర్ 20న ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ది చైల్డ్ స్మారకంగా బాలల హక్కుల దినోత్సవం పాటించడం జరుగుతుందని అందులో భాగంగానే జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచన మేరకు బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. బాలల సమస్యలను సత్వరమే పరిష్కరించుకొనుట కొరకు జిల్లాలో బాలల కోసం ప్రత్యేక ప్రజావాణి నిర్వహించడం కూడా జరుగుతుందని పద్మావతి తెలిపారు ఈ కార్యక్రమంలో బొల్లికుంట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ మజీద్ ఆలీ టీచర్లు ఉషారాణి రవి అంగన్వాడీ టీచర్లు కందిక వైదూర్య, గోలి రజిత ఎర్ర శ్రీలత గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్క చేతుల మీదుగా చేయూత పెన్షన్ల పంపిణీకి పకడ్బంది ఏర్పాట్లు

- సభా ప్రాంగణము గీసుగొండ టెక్స్టైల్ పార్క్

- సభా ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏ రేవూరి ప్రకాష్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన

గీసుగొండ నవంబర్ 16 ప్రభాతవార్త: వరంగల్ జిల్లా టెక్స్టైల్ పార్కులో



ఈనెల 18న మంత్రి సీతక్క చేతులమీదుగా చేయబోయే గీసుగొండ, సంగెం మండలాల "చేయూత పెన్షన్ల పంపిణీకి" పకడ్బందీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.ఈ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంగణంలో నూతన పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు. అందువలన పైలాన్ ప్రాంతంలోని సభా ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సభా ప్రాంగణములో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు,లబ్ధిదారులు, వాహనాల పార్కింగ్,ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను సమీక్షి ంచారు.ఈ సమావేశానికి హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జెడ్పి సీఈవో వసంత, గీసుగొండ, సంగెం తహసీల్దారులు రియాజుద్దీన్, రాజకుమార్ గీసుగొండ ఎంపీడీవో శ్రీధర్ సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

అన్నారం షరీఫ్ దర్గాలో ఉచిత సేవల పేరుతో అక్రమ వసూళ్లు

- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- భూక్య విజేందర్ నాయక్

ప్రభాతవార్త పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ప్రసిద్ధ అన్నారం షరీఫ్ హజ్రత్ సయ్యద్ యాకుబ్ షావలి బాబా దర్గాలో భక్తులకు ఉచితంగా అందించాల్సిన సేవలకు ముజావర్లు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ సెక్రటరీ భూక్య విజేందర్ నయక్ సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా విజేందర్ నయక్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు ఆదేశాల ప్రకారం దర్గాలో తవీజ్, పలిత, నాడా, వాహన ఫాతిహా తదితర సేవలను భక్తులకు ఉచితంగా అందించాల్సి ఉన్నప్పటికీ, కొందరు ముజావర్లు నిబంధనలను పట్టించుకోకుండా భక్తుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు.తవీజ్ ఒక్కింటికి రూ.100, నాడాకు రూ.20, వాహన ఫాతిహాకు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు, కోడి కందూర్ ఫాతిహాకు రూ.200, యాట కందూర్ ఫాతిహాకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రతిరోజూ దర్గాకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వివిధ సేవల పేరుతో నిర్ణీత మొత్తాలు వసూలు చేయడం వల్ల పేద, మధ్యతరగతి భక్తులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు.కావున జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, అక్రమ వసూళ్ల ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులైన ముజావర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వక్ఫ్ బోర్డు నిబంధనల ప్రకారం భక్తులకు అందించాల్సిన సేవలన్నీ ఉచితంగా అందేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.



ప్రతీ కుటుంబానికి రూ.5లక్షల జీవితబీమా భరోసా

- 19న ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకం ప్రారంభం

- 18నుంచి 59ఏళ్లలోపు ఒకరికి బీమా రక్షణ



ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ : ప్రతీకుటుంబానికి ఆర్థికభద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈనెల 19న ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకంఅమలుకు జనగామ జిల్లాయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈపథకం కింద ప్రతికుటుంబంలో 18 నుంచి 59సంవత్సరాల మధ్య వయసున్న ఒకఅర్హత కలిగిన సభ్యుడికి రూ.5లక్షల జీవితబీమా రక్షణ కల్పించనున్నారు. రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసి, ఆధార్‌కార్డు ద్వారా బీమాదారుడి వివరాలను ధ్రువీకరిస్తారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు లేదా పలువురిని నామినీలుగా ఎంపికచేసుకునే అవకాశం ఉంటుంది. ఒకరికంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపికచేస్తే వారికి కేటాయించే వాటా శాతాన్ని కూడా నమోదు చేయాలి. మైనర్ నామినీ ఉన్నట్లయితే గార్డియన్ వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలి. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యులు, నామినీల వివరాలు సమర్పించాలి. ఆన్‌లైన్ నమోదు అనంతరం దరఖాస్తు ప్రింట్ తీసుకుని సంబంధిత వ్యక్తుల సంతకాలుచేసి స్కాన్‌చేసి తిరిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

- మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక శిబిరాల ఏర్పాటు..: జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

జిల్లాలోని 12మండలాలు, 280 గ్రామపంచాయతీలు, జనగామ, ఘన్‌పూర్ మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేకశిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. గ్రామపంచాయతీలు, పట్టణవార్డుల్లో ఏర్పాటుచేసే ఈ శిబిరాల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అర్హులైన ఏ కుటుంబమూ పథకం ప్రయోజనాన్ని కోల్పోకుండా పారదర్శకంగా నమోదు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకాకుండా రూ.5లక్షల బీమా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధానఉద్దేశమని కలెక్టర్ వివరించారు.

సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల, నవంబరు 16 ప్రభాతవార్త :

అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థికభరోసా కల్పించడమే ప్రజాప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ప్రజల సంక్షేమం, పేదలఆర్థిక భద్రతకు ప్రభుత్వం పెద్దపీటవేస్తూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరుచేసిన నూతన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పాలకుర్తి మండలకేంద్రంలోని శ్రీ సోమేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈసందర్భంగా దేవరుప్పుల మండలానికి మంజూరైన 732 నూతన చేయూత పెన్షన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను ఆమె లబ్ధిదారులకు అందజేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైనవారికి పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతనంగా పెన్షన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షంవ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి, ప్రజాప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవరుప్పుల ఎంపీడీవో మేనక పౌడెల్, మండలకాంగ్రెస్ అధ్యక్షులు దావేరా అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

జనగామ, నవంబరు 16 ప్రభాతవార్త :



ప్రజావాణిలో వివిధసమస్యలతో వచ్చే ప్రజలఅర్జీలపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్‌హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా 298అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజాసమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారాలను వేగవంతం చేయాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో జెడ్పీ సీఈవో బలరామారావు, డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చిన కోట్యానాయక్, ఎస్ఈ ఎన్పీడీసీఎల్ సంపత్‌రెడ్డి, వివిధశాఖల జిల్లాఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోటిసోమవారం సందర్భంగా ఆలయాలలో ప్రత్యేకపూజలు

దేవరుప్పుల, నవంబరు 16 ప్రభాతవార్త :



కోటి సోమవారాన్ని పురస్కరించుకొని దేవరుప్పుల మండలంలోని నీ తా రా o ప్ప ర o గ్రామంలోని శ్రీ ఉమాచంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శివాచార్య పానుగంటి రామలింగేశ్వర్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, వివిధరకాల పూజాకార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పుష్పాలతో అర్చించారు. శివనామస్మరణ, మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కోటి సోమవార పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొంటే సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తులవిశ్వాసం. ఈపూజా కార్యక్రమాల్లో భక్తులుపాల్గొని శ్రీ ఉమాచంద్రమౌళీశ్వర స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయంలో భక్తిభావం వెల్లివిరిసింది.

చైర్మన్ నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు డైరెక్టర్ ఫిర్యాదు

బచ్చన్నపేట, నవంబరు 16 ప్రభాతవార్త :



బచ్చన్నపేట మండలంలోని మార్కండేయ చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘానికి చెందిన కోట్లాది రూపాయల విలువైన భవనం, మగ్గాలు, చేనేత సామగ్రి నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్నాయని సంఘం డైరెక్టర్ కొండ రామచంద్రం (రాము) ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జనగామ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు సమర్పించారు. సంఘానికి చెందిన భవనం, మగ్గాలను గత 15ఏళ్లుగా చైర్మన్ వేముల బాలరాజు తనఆధీనంలో ఉంచుకొని, కనీస నిర్వహణ లేకుండా వదిలేశారని రామచంద్రం పేర్కొన్నారు. దీంతో భవనం శిథిలమై, విలువైన మగ్గాలు పాడైపోయాయని తెలిపారు. చేనేత, సహకారశాఖల అధికారులతో కాకుండా రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా ప్రత్యేక నిఘాబృందంతో స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. నష్టాన్ని అంచనావేసి భవనానికి మరమ్మతులు చేయించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే చేనేత కార్మికులతోకలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



గబ్బెటలో మీసేవ కేంద్రం ప్రారంభం

రఘునాథపల్లి, నవంబరు 16 ప్రభాతవార్త: రఘునాథపల్లి మండలం



గబ్బెటగ్రామంలో ప్రభుత్వం ఇటీవల మంజూరుచేసిన మీసేవ కేంద్రాన్ని సోమవారం గబ్బెట గ్రామసర్పంచ్. కూటికంటి ఉపేంద్ర అనిల్‌గౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామప్రజలు వివిధ ప్రభుత్వసేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే మీసేవకేంద్రం ద్వారా అవసరమైన సేవలను పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని గ్రామప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మీసేవ కేంద్ర నిర్వాహకులు దొమ్మాట మధును సర్పంచ్ కూటికంటి ఉపేంద్ర అనిల్‌గౌడ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్లు రంగు అంజయ్య, యండి.యాకుబ్, కొయ్యడ మల్లేష్, కాంగ్రెస్‌పార్టీ మండలప్రధాన కార్యదర్శి లోనే శ్రావణ్ కుమార్, నాయకులు వల్లపు తిరుమల్ ప్రసాద్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్న కల్నల్ డా.నరేందర్‌రెడ్డి

బచ్చన్నపేట, నవంబరు 16 ప్రభాతవార్త :



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది. సాయిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కల్నల్ డాక్టర్ సి.నరేందర్ రెడ్డి సహకారంతో ప్రతిరోజూ ఉదయం విద్యార్థులకు అరటిపండ్లు అందిస్తున్నారు. గత మూడేళ్లుగా పాఠశాల ముగిసే సమయంలో వేరుశనగచిక్కీలు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి బాలకిషన్ రావు ట్రస్ట్ సేవలను అభినందించారు. విద్యార్థుల్లో పోషకాహార లోపం తగ్గి, హాజరు, చదువుపై శ్రద్ధ పెరిగాయని సర్పంచ్ కొంతం చంద్రకళ స్వామి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోఆర్డినేటర్ గొట్టె కనకయ్య, ప్రధానోపాధ్యాయుడు అమీర్, ఉపాధ్యాయులు దీక్షిత, మమత, పద్మ, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట, నవంబరు 16 ప్రభాతవార్త :

బచ్చన్నపేట మండలంలోని కేసిరెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు వడ్డుల అంబాదాస్ (43) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తక్షణ సాయంగా అంత్యక్రియల ఖర్చులకోసం ఆర్థిక సహాయం పంపించారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ అర్రె రవికుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు కాపర్తి హరిప్రసాద్ లు మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అంబాదాస్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మైనారిటీ కళాశాలలో హెచ్‌పీవీ టీకాల పంపిణీ

నర్సంపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: తెలంగాణ మైనారిటీ గురుకుల



పాఠశాల, జూనియర్ కళాశాలలో భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రాజ్ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రకాశ్ ఆకస్మికంగా తనిఖీ చేసి, టీకాల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం కళాశాల వంటగది, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆబ్కారి సీఐ జయశ్రీకి మోకుదెబ్బ సంఘం సన్మానం

నర్సంపేట,నవంబర్ 16, ప్రభాతవార్త:



ఆబ్కారి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. జయశ్రీని మోకుదెబ్బ, మాదన్నపేట గౌడ సంఘం అధ్యక్షులు గంధం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గీత కార్మికుల సభ్యత్వం, ఎక్స్‌గ్రేషియా, పింఛన్ తదితర సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని సీఐ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు మచ్చిక రాజు గౌడ్, మద్దెల సాంబయ్య గౌడ్, పట్టణ అధ్యక్షులు తాబేటి శ్రీనివాస్ గౌడ్,పులి తిరుపతి గౌడ్, గోడిశాల గిరినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

నర్సంపేట, నవంబర్ 16, ప్రభాతవార్త:



మండలంలోని భోజ్యనాయక్ తండాలో సేవా కార్యక్రమాలతో బీఎన్‌టీ తండా వారియర్స్ సొసైటీ ఆదర్శంగా నిలుస్తోంది. తండాకు చెందిన భూక్య మంగ్య (65) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సొసైటీ తరఫున రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఇప్పటివరకు తండాలో మృతుల కుటుంబాలకు చెందిన ఎనిమిది కుటుంబాలకు ఆర్థిక సాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఎన్‌టీ తండా గౌరవ అధ్యక్షులు, డీఎస్పీ భూక్య నారాయణ, భూక్య జంపయ్య (ఏఎస్ఐ), ఎన్. నాదం (ఎల్ఐసీ డీఓ), ఎన్. సాగర్ (సీఐ), భూక్య శంకర్ (సీఐ), అజ్మీర సూరయ్య (లెక్చరర్), ఎన్. నారాయణ (ఉపాధ్యాయుడు), భూక్య సాంబయ్య, బి. రాజు, ఎ. మంగులాల్, ఎ. నరేష్, ఎన్. రాజేందర్, బి. సంజీవ, ఎ. వీరప్రసాద్, బి. లక్పతి, ఎ. రాజ్‌కుమార్, బి. మోహన్, బి. తిరుపతి, రాజు జరుపుల తదితరులు పాల్గొన్నారు.

29వ డివిజన్‌లో 30 మందికి చేయూత పింఛన్ల మంజూరు

నర్సంపేట, నవంబర్ 16, ప్రభాతవార్త:



పట్టణంలోని 29వ డివిజన్‌లో వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు కలిపి 30 మందికి మంజూరైన చేయూత పింఛన్ల పత్రాలను కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. త్వరలో చేనేత కార్మికులు, వృద్ధులకు కూడా పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల సాంబయ్య గౌడ్, పట్టణ కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, డివిజన్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్, కార్యదర్శి దొమ్మటి కుమారస్వామి గౌడ్, యువజన అధ్యక్షుడు జిజుల కార్తీక్, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ అ ఖిల్ పాషా, వార్డు అధికారి శ్రీకాంత్, పంపు ఆపరేటర్ నాయిని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ రైస్ మిల్లర్ల ఆధ్వర్యంలో అన్నదానం ప్రారంభం

నర్సంపేట, నవంబర్ 16, ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ ధర్మశాస్త



అయ్యప్ప దేవాలయంలో 26వ మండల పూజ మహోత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 16 నుంచి డిసెంబర్ 27 వరకు అన్నప్రసాద వితరణ కొనసాగుతుందని ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ తెలిపారు.ఈ సందర్భంగా ఓంకార ధ్వజారోహణ, మహా సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోనెల రవీందర్, కార్యదర్శి బూరెల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు గంధం నరేందర్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్ పాల్గొన్నారు.

నెక్కొండ మండలంలో 806 మందికి కొత్త పింఛన్లు

నెక్కొండ, నవంబర్ 16, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి 806 మంది నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నర్సంపేట నియోజకవర్గానికి మొత్తం 4,900 పింఛన్లు మంజూరయ్యాయని, మరో 400 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, బక్కి అశోక్, లావుడ్య తిరుమల్, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

దుగ్గొండి, నవంబర్ 16, ప్రభాతవార్త:



ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఎస్ఐ మహేందర్, ప్రధానోపాధ్యాయుడు ఎలుగొండ రామస్వామి అన్నారు. మండల కేంద్రం ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాటాలు బోధించి పలువురిని ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాటాలు విని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశీల, సునిత, మహేష్, ఎస్‌కె అహ్మద్,కిరణ్‌కుమార్, కరుణ, ఐలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా చేయూత పింఛన్ మంజూరి పత్రాల పంపిణి

నల్లబెల్లి, నవంబర్ 16, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాల పంపిణీ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా నల్లబెల్లి మండల కేంద్రంలో నేడు అందజేయనున్నట్లు స్థానిక ఎంపీడీవో రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించనున్న చేయూత పెన్షన్ మంజూరి పత్రాల లబ్ధిదారులకు అందజేత కార్యక్రమం సభ స్థలిని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వెనకాల గల ఎస్సీ బాలుర వసతి గృహం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో అర్హులైన పెన్షన్దారులు 564 మందిని ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు, వీరందరికీ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు, ఈ సభా స్థలిని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, స్థానిక తాసిల్దార్ ముప్పు కృష్ణ, పరిశీలించారు, వీరి వెంట వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలకు బస్సు సర్వీసులు కల్పించాలని వినతి

చెన్నారావుపేట,నవంబర్ 16, ప్రభాతవార్త: మండలంలోని పలు గ్రామాలకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, చెరువుకొమ్ము తండా సర్పంచ్ భూక్య మైబుసింగ్ రాథోడ్ ఎంపీడీవో సాయి శివానంద్, తహసీల్దార్ అభిద్ అలీకి గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, మహిళలు, ప్రజలు నర్సంపేట, నెక్కొండ పట్టణాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చెరువుకొమ్ము తండా, అమృతండా, కందిగడ్డ తండా, బోడ మాణిక్యం తండా, ధర్మతండా, సూర్యపేట తండా, గొల్లబామ తండా, గొల్లపెల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జయశంకర్ వార్త
భూపాలపల్లి, కాటారం, ఏటూర్‌నాగారం, ములుగు

సిఐని కలిసిన కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు

చిట్యాల, నవంబర్ 16 ప్రభాతవార్త:

సీఐ వై.సతీష్ ను స్టేషన్ కార్యాలయంలో సోమవారం స్థానిక కాంగ్రెస్ , ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ వై సతీష్ జన్మదినోత్సవం పురస్కరించుకొని బొకేలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, ఎమ్మార్పీఎస్, ఎన్ఎస్పి నాయకులతోపాటు స్థానిక ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యుడు తౌటం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పైరవీలకు తావులేదు...

- బాధితులకు నిష్పక్షపాత న్యాయం..

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

- ప్రజాదివాస్‌లో 12 ఫిర్యాదుల స్వీకరణ..

- తక్షణ చర్యలకు ఎస్పీ ఆదేశం...

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:

ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పోలీసు అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ఆయన జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి నేరుగా 12 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ.. ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలకు నేరుగా ఫోన్ చేసి ఫిర్యాదుల వివరాలను వివరించారు. సమస్యలను వేగంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎటువంటి పైరవీలు లేదా మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీసులను ఆశ్రయించవచ్చని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై చట్టపరిధిలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ ద్వారా అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు పారదర్శక సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



పట్టుదలతో శ్రమిస్తే విజయం తథ్యం...

- ఉచిత శిక్షణ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్

- ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ వరకు అండగా ఉంటామని భరోసా...

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:

నిరుద్యోగ యువత పట్టుదలతో కష్టపడితే విజయం తప్పక వరిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భోజన వసతితో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ కేంద్రాన్ని వారు సందర్శించి, అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతుల నిర్వహణ, వసతులపై అభ్యర్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఈ ఉచిత శిక్షణ ఎంతో దోహదపడుతుందని, అభ్యర్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల వల్ల పేద అభ్యర్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందలేరనే ఉద్దేశంతో ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కేవలం ప్రిలిమ్స్‌కే పరిమితం కాకుండా, రాత పరీక్షలు (మెయిన్స్), ఫిజికల్ ఈవెంట్స్‌కు గ్రౌండ్ కోచింగ్ అందిస్తూ, అభ్యర్థులు ఉద్యోగం సాధించే వరకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి టౌన్ సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.



ప్రజావాణి అర్జీలను వారంలోగా పరిష్కరించాలి...

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు..

- పోర్టల్‌లో పరిష్కార వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి..

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం..

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో :

ప్రజల నుండి స్వీకరించిన వినతులను ఎలాంటి జాప్యం లేకుండా వారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 85 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు. అర్జీదారుల నమ్మకాన్ని నిలబెట్టేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు ఎండార్స్ చేశామని, తీసుకున్న చర్యల వివరాలను తప్పనిసరిగా ప్రజావాణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వహించినా, నిరక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీవో హరి కృష్ణ మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- ఐడీఓసి కార్యాలయంలో ఘనంగా పిల్లల ప్రత్యేక ప్రజావాణి..

- తొలిరోజు పిల్లల నుండి 5 వినతులు స్వీకరణ...

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డెస్క్ ఏర్పాటు..

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:

పిల్లల హక్కులను పరిరక్షించడం, వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, యూనిసెఫ్ సహకారంతో పిల్లల ప్రత్యేక ప్రజావాణిని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల నుండి కలెక్టర్ స్వయంగా వినతులను స్వీకరించారు. ఈ ప్రత్యేక ప్రజావాణిలో మొత్తం 5 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు. పిల్లలు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఇందుకోసం ప్రాంగణంలో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్య, వైద్యం, పోషకాహారం, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుతో పాటు బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు, దోపిడీ వంటి అంశాలపై పిల్లలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అందిన దరఖాస్తులపై అత్యంత ప్రాధాన్యతతో తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, ఆర్డీఓ హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టిఆర్ఎస్ చేసిన ఆరోపణలపై హరీష్ రావు సమాధానం చెప్పకుండా దాటవేత..

- ఏమి తెలియని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో మాట్లాడించడం సిగ్గుచేటు

- బుర్ర వినోద్ గౌడ్, టిఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షులు

భూపాలపల్లి టౌన్, నవంబర్ 16, ప్రభాతవార్త:



సిద్దిపేట పర్యటనలో కల్వకుంట్ల కవిత చేసిన అవినీతి ఆరోపణలపై హరీష్ రావు సమాధానం చెప్పకుండా దాట వేత వేశాడని జయశంకర్ జిల్లా టీఆర్ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు బుర్ర. వినోద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత హరీష్ రావు సమాధానం చెప్పకుండా ఆయన అనుచరుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో మాట్లాడించడం సిగ్గుచేటు అని అన్నారు.అంతేకాక హరీష్ రావుకు దమ్ము ధైర్యం ఉంటే ఆయనపై కవితక్క చేసిన విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. అంతేకాక బీఆర్ఎస్ ప్రభుత్వ ఆయాయంలోగురుకులాల నిర్వహణ, వెలుగుమట్లలో దళితుల ఇళ్ల కూల్చివేత, సిరిసిల్ల ఇసుక లారీల ఘటనల సమయంలో బీఆర్ఎస్ నేతలు మరియు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న కవితక్కపై విమర్శలు చేయడం తగదని,నిజానిజాలు త్వరలోనే బయటకు వస్తాయని ఈ సందర్భంగా వినోద్ గౌడ్ పేర్కొన్నారు.

నైన్ పాకలో టిఆర్‌పి జెండా ఆవిష్కరణ

- పార్టీలో పలువురి చేరిక

చిట్యాల నవంబర్ 16 ప్రభాతవార్త:

మండలంలోని నైన్ పాక గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను జిల్లా పార్టీ అధ్యక్షుడు రవి పటేల్ సోమ వారం ఆవిష్కరిం చారు, జిల్లా అధ్య క్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు టిఆర్వి లో చేరగా వారికి కండువా లు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ.బీసీ, ఎ స్సీ, ఎస్టీ, మైనారిటీల రా జ్యాధికారం కోసం తెలం గా ణ రాజ్యాధికార పార్టీ ఏర్ప డిందని, పార్టీ వ్యవ స్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మా ర్ మల్లన్న చేస్తున్న పోరాటా నికి అందరూ మద్దతు పలకాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహ బూబ్ అలీ, మండల నాయ కులు పుట్ట మొగిలి, ముదా స్తు రమేష్, గాజుల రమేష్, ఆకునూరి వంశీకృష్ణ, భాష వేణి రవీందర్, రాయా రాకుల రవి, రేపాల కిరణ్, గాజుల తిరుపతి, గాజుల శ్రీకాంత్, మహమ్మద్ రంజా న్, డాక్టర్ రామరాజు, గాజు ల సురేష్, దుద్దేటి శ్రీను తది తరులు, పాల్గొన్నారు.



ప్రజావాణి, పిల్లల ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

-అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్

మహబూబాబాద్ టౌన్,ప్రభాతవార్త:



ప్రజావాణి, పిల్లల ప్రజావాణి కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థుల నుండి స్వీకరించిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ ప్రజావాణితో పాటు ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వినతిపత్రాలను స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18 సంవత్సరాలలోపు బాలబాలికలు నేరుగా అధికారులకు తమ సమస్యలను విన్నవించుకోవడానికి ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఇన్‌ఛార్జ్ డీడబ్ల్యూఓ శిరీష సంబంధిత అధికారుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల వినతుల్లో భాగంగా ఎంపీయూపీఎస్ మోడల్ స్కూల్ ఏరియా ఆసుపత్రి సమీపంలో తమ పాఠశాలలో ప్రీప్రైమరీ నుండి 7వ తరగతి వరకు మొత్తం 180 మంది విద్యార్థులు ఉన్నారని, కేవలం 5తరగతి గదులు, 3మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు షేక్ ఆసిఫా (6వ తరగతి), షేక్ హనీఫా మీరాన్ (4వ తరగతి) వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా వర్షాకాలంలో వరండాలో కూర్చోవాల్సి వస్తోందని, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన తమ పాఠశాలలో 360 మంది విద్యార్థులు చదువుతున్నారని, కనీస మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నామని విద్యార్థులు విన్నవించారు. పాఠశాల రక్షణ కోసం ప్రహరీగోడ నిర్మాణం, మధ్యాహ్న భోజనం చేసేందుకు డైనింగ్ హాల్, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సాధారణ ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం (178) దరఖాస్తులు అందాయి. ఇందులో జిల్లా స్థాయిలో (125), డివిజన్ స్థాయిలో (01) , మండల స్థాయిలో (46) దరఖాస్తులతో పాటు ప్రత్యేకంగా నిర్వహించిన పిల్లల ప్రజావాణిలో 6దరఖాస్తులు స్వీకరించారు.

ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ టౌన్,నవంబర్16,ప్రభాతవార్త:

భారతదేశ మాజీ ప్రధాని ఈ నెల 19న ఉన్నందున వేడుకలను ఘనంగా నిర్వహించాలని టిపిసిసి ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం మహబూబాబాద్ మున్సిపాలిటీ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ లను కలసి ఇందిరా గాంధీ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇందిరా చౌక్ లోని ఇందిరా గాంధీ విగ్రహానికి నూతనంగా కొత్త రంగులు వేయించి అలాగే గద్దె,స్టాండ్లకు ఏమైనా రిపేరు ఉంటే తొందరగా రిపేర్ చేయించి వాటికి కూడా రంగులు వేయవలసిందిగా కోరారు. అనంతరం వెంకట్ నాయక్ మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి ఏకైక మహిళ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అని దేశ మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి వారి సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేస్తూ వారికి సముచిత గౌరవాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పట్టణ ఎస్టీ సెల్ చైర్మన్ తేజావత్ శంకర్ నాయక్, మహబూబాబాద్ అర్బన్ వైబిసిఎల్ ప్రెసిడెంట్ లింగాల వీరభద్రగౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు చీదిరాల జ్ఞానేశ్వర్, మహబూబాబాద్ జిల్లా ఐఎన్టియుసి మాజీ అధ్యక్షులు వెన్నమల్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గార్ల,నవంబర్16,ప్రభాతవార్త:



ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రతి ఒక్కరు భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్ కోరారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధి కోసం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతీరాం నాయక్, మండల విద్యాశాఖాధికారి మంకిడి వీరభద్రరావు లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చదువుతో పాటు ప్రత్యేక శిక్షణ, మానసిక, శారీరక అభివృద్ధికి భవిత కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను భయపడకుండా పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి.పద్మావతి, ఉపాధ్యాయులు చింత రమేష్, డేవిడ్ రాజ్, పి. అనిత, ఐఈ ఆర్ పి కె. సంధ్యారాణి, ఎ. కిరణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

-ఎమ్మెల్యే డా.భూక్యా మురళి నాయక్

మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డా.భూక్యా మురళి నాయక్ అన్నారు. పట్టణంలోని పిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన ఆసరా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డా. భూక్యా మురళి నాయక్ ,ఎంపీ బలరాం నాయక్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సమాజంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పెన్షన్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా దివ్యాంగులు - 266, ఒంటరి మహిళలు -189, కల్లుగీత కార్మికులు-40,వితంతువులు-725, మొత్తం - 1,220 మందికి పెన్షన్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్,, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపేట శివాలయంలో ఇరుముడి కార్యక్రమం

-హాజరైన మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ,నవంబర్16,ప్రభాతవార్త:

మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలోని శివాలయంలో సోమవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమానికి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు తనయుడు, యువ నాయకుడు డీఎస్ రవిచంద్ర కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట సర్పంచ్ గండి రాధమ్మ, గండి మహేష్, తాళ్లపల్లి శ్రీను, తాళ్లపల్లి రఘు, గండి పరమేష్, ప్రతాప్ రెడ్డి, గండి పుల్లయ్య, గండి వెంకటేశ్వర్లు, హుస్సేన్ తదితర గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ వార్త
మహబూబాబాద్, తొర్రూరు

పాకాల వాగులో జాలరి వలకు చిక్కిన వింత చేప

-తాబేలు ఆకారంలో గట్టి చర్మం

-చేపను చూసేందుకు స్థానికుల ఆసక్తి

బయ్యారం,ప్రభాతవార్త,నవంబర్16:



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని పాకాల వాగులో జాలరి వలకు వింత చేప చిక్కడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. సోమవారం గంగబజార్ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు చేపల వేటకు వెళ్లగా ఓ వ్యక్తి వలలో ఈ వింత చేప పడింది.సాధారణ చేపలకు ఇరువైపులా మొప్పలు ఉండగా, ఈ చేపకు తాబేలు మాదిరిగా గట్టి చర్మంపై మొప్పలు ఉన్నట్లు జాలర్లు గుర్తించారు. ఉదయం వలలో చిక్కిన చేపను నీటి నుంచి బయటకు తీసినప్పటికీ సాయంత్రం వరకు సజీవంగా ఉండటం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపారు. ఈ చేప సముద్రం నుంచి నదుల మీదుగా వాగులోకి వచ్చి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. వింత ఆకారంలో ఉన్న చేపను చూసేందుకు కాలనీవాసులు, చుట్టుపక్కల ప్రజలు ఆసక్తి చూపడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

రహదారి సమస్యపై బీఆర్ఎస్ పార్టీ ఆందోళన

బయ్యారం,ప్రభాతవార్త,నవంబర్16:

బయ్యారం మండలం గౌరారం నుంచి వినోబా నగర్‌కు వెళ్లే రహదారిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి గౌరారం పంచాయతీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు గంగుల సత్యనారాయణ మండల నాయకులు మేకల ఉప్పలయ్య,యువ నాయకురాలు నానాభాల ఉమాదేవి మాట్లాడుతూ చొక్ల తండా నుంచి గురిమల్ల వరకు ఉన్న బీటీ రోడ్డు పునరుద్ధరణకు గత ఎమ్మెల్యే హరిప్రియ నిధులు కేటాయించడంతో పనులు ప్రారంభమయ్యాయని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు రద్దు చేయడంతో నిర్మాణం నిలిచిపోయిందని ఆరోపించారు. రోడ్డు అధ్వానంగా మారడంతో నిత్యం ప్రయాణించే ప్రజలు, ముఖ్యంగా గర్భిణులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గౌరారం సర్పంచ్ లలిత మహేష్, గురిమల్ల సర్పంచ్ భద్రయ్య పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా కలెక్టర్‌కు సమస్యను విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు .ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గౌరారం పంచాయతీ బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కష్టానికి కొత్త దారి... రాళ్లపైనే ఫోన్ నంబర్!

- కార్మికుల వినూత్న ఆలోచన

నెల్లికుదురు,నవంబర్ 16 ప్రభాతవార్త:

జీవనోపాధి కోసం కష్టపడే కొంతమంది కార్మికులు తమ వృత్తిలోనే వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు తాము అందుబాటులో లేకపోయినా,తమ పని కోసం వెతికేవారికి వారి వివరాలు తెలిసేలా బండరాళ్లపైనే ఫోన్ నంబర్ రాసి పెట్టారు నెల్లికుదురు మండలం మదనతూర్తి గ్రామానికి చెందిన షేక్ సైదులు, షేక్ నాగ, షేక్ ఫకీర్ లు జీవనోపాధి కోసం బండరాళ్లను కొట్టి అవసరమైన ఆకారాల్లో తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.అయితే పని నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు కాని అందుబాటులో లేనప్పుడు తమ కోసం వచ్చే వారికి సమాచారం ఎలా అందించాలనే ఆలోచనకు ఓ వినూత్న పరిష్కారం కనుగొన్నారు .తాము తయారు చేసిన రాళ్లను ఒకచోట వరుసగా అమర్చి, వాటిపై వారి ఫోన్ నంబర్‌లోని అంకెలను రాశారు దీంతో ఆటువైపు నుంచి వెళ్లేవారికి వారి ఫోన్ నంబర్ కనిపించేలా ఏర్పాటు చేశారు.తమను



ప్రత్యక్షంగా కలవకపోయినా, ఫోన్ ద్వారా సంప్రదించి పని గురించి మాట్లాడుకునే విధంగా రాళ్ల పై కలర్ తో ఫోన్ నెంబర్ రాశారు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్దగా ఉపయోగించుకోలేని సాధారణ కార్మికులు వారి జీవనోపాధి కోసం చూపిన ఈ చిన్న ఆలోచన చాలా ఆసక్తికరంగా మారింది. ఉపాధి కోసం కష్టపడటమే కాదు,అందుబాటులో లేని సమయంలోనూ పని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు చేసిన ఈ ప్రయత్నం పలువురిని ఆకట్టుకుంటోంది.కష్టపడే చేతులకు తోడు కాస్త ఆలోచన ఉంటే ఉపాధికి కొత్త మార్గాలు వెతుక్కోవచ్చని ఈ కార్మికుల ప్రయత్నం చాటిచెబుతోంది.



ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు పరస్తాం

- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందిస్తాం

- డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్

నరసింహుల పేట నవంబర్ 16 ప్రభాతవార్త:



ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు పరస్తామని డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటుచేసిన పెన్షన్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అనంతరం మండలంలో 471 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన 281 వితంతువులు 82 దివ్యాంగులు 36 మంది ఒంటరి మహిళలు 71 మంది గీత కార్మికుల ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్ కార్డులను పంపిణీ చేసి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాల బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో కనీసం పెన్షన్ మంజూరు చేయడంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు నేడు పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని అర్హత ఉండి పెన్షన్ రానివారు ఎలాంటి ఆందోళన చందనవసరం లేదని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించడం జరుగుతుందని ఎవరైనా నిజమైన లబ్ధిదారులు ఉంటే వారి వివరాలను సేకరించి వారికి కూడా పెన్షన్ అందేందుకు అధికారులు కృషి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు పరచడంతో పాటు ఒకవైపు సంక్షేమ పథకాలు మరోవైపు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రేవంత్, ఎంపీడీవో అంజలి, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జినికల రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రఘువీరారెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బాబురావు సర్పంచులు పెదమాముల యాకయ్య రాజేందర్ పుప్పాల రవీందర్ నెలకుర్తి రేణుక అశోక్ రెడ్డి రఘు లచ్చు ఉప్పలయ్య సేవ్య కాంతి శారద కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణిచివేయలేరు

నరసింహుల పేట నవంబర్ 16 ప్రభాతవార్త:



అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అనివి వేయలేరు అని తొర్రూర్ మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయింపులు అవకతోకలపై బిఆర్ఎస్ పార్టీ ఆందోళన చేపట్టడంతో ముందస్తు వారిని అరెస్టు చేసి నరసింహుల పేట పోలీస్ స్టేషన్ కు తీసుకురావడంతో మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైదం దేవేందర్ నాయకులు వారికి సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు అనంతరం మైదం దేవేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం హామీలు అమలు పరచలేక ప్రతిపక్ష పార్టీల నోరు నొక్కడం ఎంతవరకు సమంజసం అని ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు రాబోయే రోజుల్లో ప్రజల చేతుల్లో ఓటమి తప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు నెలకుర్తి సత్తిరెడ్డి గుజి వీరస్వామి మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రవికుమార్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండబత్తిని జగదీశ్వర్ డొనికని రామన్న గౌడ్ , మిర్యాల వెంకన్న సుంకరి చంద్రం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతా

- సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య

నరసింహుల పేట నవంబర్ 16 ప్రభాతవార్త:



డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ సహకారంతో నర్సింహులపేట మండలం పడమటి గూడెం గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దామని సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య ఉపసర్పంచ్ నవీన్ రెడ్డి అన్నారు. సోమవారం పడమటి గూడెం గ్రామంలో పెన్షన్లు మంజూరై నేడు మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ చేతుల మీదుగా పెన్షన్ మంజూరు పత్రాలు అందజేయడంతో వితంతువులు దివ్యాంగులు గీత కార్మికులు ఒంటరి మహిళలకు వారి పక్షాన ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు హెచ్ యాకయ్య హెచ్ వెంకటమ్మ జక్కి మురళి లత ఆసియా బేగం మహబూ భాష, సుజాత యాకయ్య స్వామి నాయక్ ఉపేందర్ గౌడ్ నాగరాజు మధు బిక్షం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు కోసం ఎమ్మెల్యేను వేడుకున్న వికలాంగుడు

- 20 ఏళ్లుగా గుడిసెలోనే నివాసం..

- ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకోలు

నర్సింహులపేట నవంబర్ 16 ప్రభాతవార్త:



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో హృదయాన్ని కలచివేసే ఘటన చోటుచేసుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్‌ను జయపురం గ్రామానికి చెందిన గుజ్జునూరి యాకయ్య వికలాంగుడు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్నాడు. గత



20 ఏళ్లుగా గుడిసెలోనే నివసిస్తున్నానని, తనకు ఇప్పటివరకు సొంత ఇల్లు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. నిరుపేదనైన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వినతిపత్రం అందజేస్తూ అందజేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తికి యాదవరెడ్డి పరామర్శ

నెల్లికుదురు నవంబర్ 16 ప్రభాతవార్త:

మండలంలోని హేమ్లాతండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బానోతు నరసింహ అనారోగ్య కారణాలతో హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎదల్ల యాదవరెడ్డి సోమవారం ఆసుపత్రిలో ఆయనను పరామర్శించారు ఆరోగ్య పరిస్థితిని వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షించారుఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు

నెల్లికుదురు, నవంబర్ 16 ప్రభాతవార్త :



ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి మండలంలో వివిధ శాఖలకు సంబంధించి ఏడు ఫిర్యాదులు అందాయి. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 03 పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 01, గృహ నిర్మాణ శాఖకు 02, విద్యుత్ శాఖకు 01 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీవో సింగారపు కుమార్ వెల్లడించారు. మొత్తం ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు ప్రజావాణి నివేదికలో పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలపై అందించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు .

బాగుపడనున్న పాత బిటి రోడ్లు

- రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం
- గూడూరులో నేడు శంకుస్థాపన
- హాజరు కానున్న వేం, పోరిక, మురళీనాయక్





గూడూరు, నవంబర్ 16, ప్రభాతవార్త:

గూడూరు-కేసముద్రం, గూడూరు-నెక్కొండ పట్టణాలను కలుపుతూ ప్రధాన రవాణా మార్గంగా ఉండి గత కొంత కాలంగా వాహనదారులకు ఇబ్బంది కలిగించే విధంగా తయారైన బిటి రోడ్లు ఇక బాగుపడనున్నాయి. హామ్(హెచ్ఎఐ) కార్యక్రమం క్రింద ఈ రోడ్ల విస్తరణ పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. అవసరమైన అంచనాలు రూపొందించి టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేసిన క్రమంలో ఆర్అండ్బి శాఖ ఆధ్వర్యంలో రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ శివారులోని పాకాలవాగు వంతెన నుండి అటు కేసముద్రం, ఇటు నెక్కొండ పట్టణాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న బిటి రోడ్లను రోడ్డు విస్తరణలో భాగంగా ఈ రెండు రోడ్లను పది మీటర్ల వెడల్పుకు విస్తరించనున్నారు. ఇందుకుగాను గూడూరు నుండి కేసముద్రం మార్గంలో తీగలవేణి వరకు రూ.55 కోట్లు, గూడూరు నుండి నెక్కొండ మార్గంలో గుండెంగ వరకు రూ.35 కోట్ల అంచనా వ్యయంతో రోడ్ల విస్తరణ పనులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆర్అండ్బి అధికారులు తెలిపారు. ఈ రోడ్ల విస్తరణ పనులు ప్రారంభం కానున్న క్రమంలో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అటు కేసముద్రం, ఇటు నెక్కొండ మార్గాల్లో బిటి రోడ్లు చాలా చోట్ల శిథిలమై గోతులమయంగా మారి ఈ మార్గంలో ప్రతి నిత్యం ప్రయాణించే వారు ఇంతకాలంగా అనేక ఇబ్బందులకు గురయ్యారు. బిటి రోడ్ల నిడివిని విస్తరిస్తూ కొత్తగా బిటి రోడ్ల నిర్మాణాలు పూర్తయితే వాహనదారుల అవస్థలు తొలిగిపోనున్నాయి.

- నేడు శంకుస్థాపన....

గూడూరు-కేసముద్రం, గూడూరు-నెక్కొండ మార్గాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన బిటి రోడ్ల విస్తరణ పనులకు ఈనెల 17న శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. సిఎం సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్రెడ్డి, మహబూబాబాద్ ఎంపి బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ల చేతుల మీదుగా ఈ శంకుస్థాపన వేడుక నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఈమేరకు పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయం ముందు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఏర్పాటు చేయగా అదే కార్యాలయ ప్రాంగణంలో శంకుస్థాపన సభ నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేసారు. వేం నరేందర్రెడ్డి మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఇదిలా ఉండగా శంకుస్థాపన కార్యక్రమం అనంతరం పాకాల వాగుపై కొత్తగా హైలెవెల్ వంతెన నిర్మాణ ప్రతిపాదనలకు సంబంధించి వీరు స్థల పరిశీలన చేయనున్నారని, పట్టణంలోజి బస్టాండ్ సెంటర్లో జాతీయ రహదారిపై జంక్షన్ ఏర్పాటుకు సంబంధించి పరిశీలించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా మండలంలోని ఎర్రకుంటతండా శివారులో కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వీరు పరిశీలించనున్నారు.

- పట్టణంలో కూడా రోడ్డు విస్తరణ...

గూడూరులోని బస్టాండ్ సెంటర్లోని జాతీయ రహదారి సర్కిల్ నుండి పాకాల వాగు వరకు ఉన్న పట్టణంలోని ప్రధాన రహదారిని కూడా విస్తరించి సెంటర్లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. గూడూరు-కేసముద్రం, నెక్కొండ బిటి రోడ్లను హామ్ స్కీం కింద పది మీటర్ల రోడ్లుగా విస్తరిస్తూ పనులు మంజూరైన క్రమంలో ఈ రహదారులను కలుపుతూ గూడూరు పట్టణంలో ఉన్న ప్రధాన బిటిరోడ్డును వంద ఫీట్ల రోడ్డుగా అభివృద్ధి పరచనున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లుగా ఆర్అండ్బి అధికారులు చెపుతుండగా బిటి రోడ్ల విస్తరణ పనుల శంకుస్థాపనకు ఈనెల 17న హాజరవుతున్న సిఎం సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్రెడ్డి దీనిపై క్లారిటీ ఇచ్చే అవకాశం ఉందని చెపుతున్నారు. పట్టణంలో కూడా రోడ్డు విస్తరణకు సంబంధించి ఇప్పటికే హడావిడి చోటు చేసుకోగా ఆర్అండ్బి అధికారులతో కలిసి స్థానిక అధికారపార్టీ నాయకులు రోడ్డు వెడల్పుకు కొలతలు కూడా వేసి చూసినట్లు తెలిసింది. కాగా దీనిపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.



అలుగుకు అడ్డుకట్టలు వేస్తున్నారు

- బొమ్మాయికుంట రైతుల ఫిర్యాదు

గూడూరు, నవంబర్ 16, ప్రభాతవార్త:



గూడూరు శివారులోని బొమ్మాయికుంట చెరువుకు సంబంధించి అలుగునీరు ప్రవాహం సాఫీగా వెళ్లకుండా కొంతమంది అడ్డుకట్టలు కట్టి చెరువు శిఖం భూమిని ఆక్రమిస్తున్నారని ఆయకట్టురైతులు పలువురు ఆరోపిస్తున్నారు. ఈమేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపిడిఓ టివిఎల్ఎన్ శాస్త్రికి ఫిర్యాదుపత్రం అందజేసారు. కుంట అలుగుకు కొంతమంది రైతులు అడ్డుకట్టలుగా మట్టిపోయడం వల్ల అలుగునీరు వృధాగాపోయి తమ పంటలకు గతంలో నష్టం వాటిల్లిందని, ఇప్పుడు కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు. బొమ్మాయికుంట చెరువు విస్తీర్ణం సుమారు 52 హెక్టార్లు ఉంటుందని, అందులో కొందరు రైతులు అక్రమంగా చెరువు భూమిని ఆక్రమించి బావులు తీసుకున్నారని, దీనిపై తగిన విచారణ చేయడంతో పాటు చెరువు భూమిని సర్వే చేయించి శిఖం భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సదరు రైతులు విజ్ఞప్తి చేసారు. ప్రజావాణిలో దరఖాస్తు అందజేసిన వారిలో గోవగాని యాదగిరి, పానుగంటి అజయ్కుమార్, కసరబోయిన వీరమల్లు, తోటకూరి శ్రీను, బండారి కుమారస్వామి, కట్టమల్లు, నేరడి మురళి, ఇండ్ల సాంబయ్య, రజిత, గోపగాని శ్రీనివాస్ ఉన్నారు.

అంబేద్కర్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- ఎమ్మార్పీఎస్, వీసీకే డిమాండ్

భూపాలపల్లి టౌన్, నవంబర్ 16, ప్రభాతవార్త: జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని విద్యార్థులు, పేద యువతీ యువకులు, నిరుద్యోగులకు ఉపయోగపడేలా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కోచింగ్ ట్రైనింగ్ సెంటర్ను వెంటనే ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు అంబాల చంద్రమోళి మాదిగ, వీసీకే రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో అంబాల చంద్రమోళి మాదిగను అంబాల అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ , బహుజన పేద విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉచిత శిక్షణ కేంద్రం ఎంతో అవసరమన్నారు. ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందలేక అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్, ఎస్సీ డెవలప్మెంట్ విద్యాశాఖ అధికారులు సమన్వయంతో స్పందించి విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని కోరారు. అధికారులు నిరక్ష్యాన్ని వీడి తక్షణమే కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోతే ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, వీసీకేతో పాటు ఇతర విద్యార్థి సంఘాలను కలుపుకొని నిరంతర ప్రజాస్వామ్య ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం కోచింగ్ సెంటర్ ఏర్పాటు కోసం వీసీకే రూపొందించిన ఉద్యమ కరపత్రాన్ని అంబాల చంద్రమోళి మాదిగ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మడిపెల్లి శ్యామ్, దోర్నాల రాజేందర్, మంద తిరుపతి, వంతడుపుల సురేష్, రామ్ చందర్ మాదిగ, మచ్చ శ్రీకాంత్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఎర్ర వంశీ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ, ఎర్ర భద్రయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు

కేసముద్రం, నవంబర్ 16, ప్రభాతవార్త:



కేసముద్రంలోని పెద్ద బజారులో లయన్స్ క్లబ్ కేసముద్రం శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది వరకు ఉచితంగా మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ యర్నం శ్రీరాములు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె చంద్రశేఖర్, ట్రెజరర్ మడిపెద్ది వెంకటేష్ పాల్గొన్నారు.

నవజ్యోతి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ

- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘ సభ్యులు...


కాటారం, నవంబర్ 16, ప్రభాతవార్త:

కాటారం మండలం అంకుషాపూర్ గ్రామంలోని నవజ్యోతి వీఓ మహిళా సమాఖ్య నూతన భవన నిర్మాణ పనులకు సోమవారం ముగ్గుపోసి (భూమిపూజ) ఘనంగా శ్రీకారం చుట్టారు. మహిళా సంఘాల బలోపేతానికి, వారి సమావేశాల నిర్వహణకు ఈ నూతన భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోదరి కల్పన దేవయ్య, ఉప సర్పంచ్ కర్కా ఉమాశంకర్, వార్డు సభ్యులతో పాటు భవన నిర్మాణానికి స్థలాన్ని అందించిన భూమి దాతతో పాటు ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏఈ, టీఏ, ఎఫ్ఏ, సీసీ, గ్రామ సంఘం అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు, వీఓఏ మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సీనియర్స్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు

కేసముద్రం, నవంబర్ 16, ప్రభాతవార్త: కేసముద్రంలో జాతీయ



పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సీనియర్ జర్నలిస్టుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేసముద్రం సీనియర్స్ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎసల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కూన శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గాజుల రవి, కోశాధికారిగా పందుల రవిచంద్ర,సహాయ కార్యదర్శిగా శీలం దామోదర్ లను సీనియర్ పాత్రికేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎసల్ల సత్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయడంతో పాటు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకై పోరాటం చేస్తామన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సీనియర్స్ ప్రెస్ క్లబ్ ముందుంటుందని, తన ఎన్నికకు సహకరించిన జర్నలిస్టులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.





కాళేశ్వరంలో వైభవంగా సహస్ర దీపాలంకరణ..

కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం..

మహాదేవపూర్, నవంబర్ 16, ప్రభాతవార్త

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. మహేష్ చేతుల మీదుగా పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి చిత్రపటంతో కూడిన వాయనాన్ని ప్రసాదంగా అందజేశారు. కార్తీక మాస తొలి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో సందడిగా మారింది. గ్రామస్తులు, భక్తులు, మహిళలు, సేవా సమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా భక్తుల రాకతో ఆలయానికి వివిధ పూజా టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా సుమారు రూ.2,60,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ప్రజాప్రభుత్వంలో పేదలకు "చేయూత".

చేయూత పెన్షన్లతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు

రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు

ములుగు జిల్లాలో 4,262 మందికి మంజూరు

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం: మంత్రి సీతక్క

ములుగు ప్రభాతవార్త నవంబర్ 16:

నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.5 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేయగా, వారిలో 3.5 లక్షల మంది మహిళలే ఉన్నారని తెలిపారు. సోమవారం ములుగు మండలం ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ములుగు, వెంకటాపూర్ మండలాలు, ములుగు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మరో 13 వేల దరఖాస్తులు అందాయని, అర్హత ఉండి పింఛన్లు పొందని వారిని గుర్తించి తప్పకుండా మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేతన్నలు, గీతన్నలతో పాటు రాష్ట్రంలో తొలిసారిగా తలసేమియా బాధితులకు సైతం పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రూ.75 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు వంటి పథకాలతో ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని తెలిపారు. కుటుంబ సంపాదన సభ్యుడిని కోల్పోయిన వారికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

జిల్లాలో 4,262 మందికి పింఛన్లు..

కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 4,262 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. మండలాల వారీగా ఏటూరునాగారం 485, గోవిందరావుపేట 497, కన్నాయిగూడెం 81, మల్లంపల్లి 219, మంగపేట 667, ములుగు 390, తాడ్వాయి 340, వెంకటాపూర్ 396, వెంకటాపురం 515, వాజేడు 470, ములుగు మున్సిపాలిటీలో 202 మందికి మంజూరైనట్లు వివరించారు. సోమవారం ములుగు, వెంకటాపూర్ మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని 988 మందికి మంజూరు ఉత్తర్వులు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మూడు రోజులపాటు అన్ని మండలాల్లో ఉత్తర్వుల పంపిణీ పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



భక్తి పారవశ్యంతో వెల్లి విరిసిన బాలాలయం..

కార్తీక మాసం తొలి సోమవారం కాళేశ్వరానికి పోటెత్తిన భక్తులు..

త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు..

కాళేశ్వర ముక్తీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు..

మహాదేవపూర్, నవంబర్ 16, ప్రభాతవార్త

జయశంకర్ భూపాలపల్లి మహాదేవపూర్ మండలం కాళేశ్వరం కార్తీక మాసం తొలి సోమవారం బాలలయం లో భక్తులతో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కాళేశ్వరం క్షేత్రం భక్తజన సందోహంతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు ముందుగా గోదావరి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇసుకతో సైకత లింగాలను రూపొందించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం గోదావరిలో దీపాలను వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ ఆది ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామివారికి మారేడు దళాలు సమర్పించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాలయంలోని దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు కుంకుమార్చనలు నిర్వహించడంతో పాటు ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. అర్చకులకు దీపదానం చేసి కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని ప్రార్థించారు. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా కాళేశ్వరం క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది.





విధుల్లో నిరక్ష్యం.. ఏఈపై కలెక్టర్ ఆగ్రహం...

మంత్రి సీతక్క పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో విద్యుత్ అంతరాయం.. ఏఈపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు.

ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాతవార్త నవంబర్ 16:



విధి నిర్వహణలో నిరక్ష్యం వహించిన విద్యుత్ శాఖ అధికారిపై జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క పాల్గొన్న నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్.. ములుగు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఆపరేషనల్) బానోతు రవిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. సోమవారం ములుగు మండలం ఇంచర్లలోని ఎంఆర్ గార్డెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ములుగు, వెంకటాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సజావుగా సాగేందుకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ములుగు ఎంపీడీవో ముందస్తు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ కార్యక్రమం జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అధికారిక కార్యక్రమానికి ఆటంకం ఏర్పడింది. మంత్రి, ప్రజల సమక్షంలో జిల్లా యంత్రాంగానికి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది.

ముందస్తు ఏర్పాట్లు ఏవీ...?

ఈ కార్యక్రమానికి నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ఏఈ విఫలమయ్యారని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే సరఫరా పునరుద్ధరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, కార్యక్రమ ప్రాంగణంలో ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచకపోవడం విధి నిర్వహణలో నిరక్ష్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు.

విద్యుత్ శాఖ ఏఈ పై చర్యలకు కలెక్టర్ సిఫార్సు...

ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు.. ఏఈ బానోతు రవిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీకి లేఖ రాసినట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. విధుల పట్ల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరారు.



సామూహిక దీక్షను విజయవంతం చేయాలి కన్వీనర్ పోరిక స్వరూప్ సింగ్



ప్రభాత వార్త వాజేడు

ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం తలపెట్టిన సామూహిక దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూషనరీ పెన్షన్ ఎంప్లాయిస్ యూనియన్ వాజేడు మండల గౌరవ అధ్యక్షులు పోరిక స్వరూప్ సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో స్వరూప్ సింగ్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చి ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నూతన పెన్షన్ విధానంలో ఉద్యోగులకు లభించే పెన్షన్ కనీస కుటుంబ అవసరాలు తీర్చుకోవడానికి కూడా సరిపోవడంలేదని ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు ఉద్యోగుల యొక్క మనోగతాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తలపెట్టిన సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వరూప్ సింగ్ పిలుపునిచ్చారు. సామూహిక సెలవు పత్రాలను డి డి ఓ ఆనందరావు కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ నాయకులు జానకిరావు, రాంబాబు, బాలాజీ సతీష్ కుమార్, రాజేష్, ప్రేమ్ కుమార్, శ్రీకాంత్, నాగార్జున, నాగేంద్ర ప్రసాద్, మనోజ్, అలీముద్దీన్ ఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి!

66 ఏళ్ల దాటినా పింఛన్ అందని వృద్ధులు

ఎంపీడీవోకు బుస్సాపూర్ సర్పంచ్ వినతి

గోవిందరావుపేట, ప్రభాతవార్త:

గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పింఛన్లు మంజూరు చేయాలని బుస్సాపూర్ సర్పంచ్ పాలెం యాదగిరి అధికారులను కోరారు. సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలెం యాదగిరి మాట్లాడుతూ, గ్రామంలో ఇప్పటికే కొత్త పింఛన్లు మంజూరైనప్పటికీ మరికొంతమంది అర్హులు పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు సైతం ఇప్పటివరకు పింఛన్లు అందకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. అర్హులైన వృద్ధులు, ఇతర లబ్ధిదారుల తరఫున పింఛన్ల కోసం దరఖాస్తులు సమర్పించినట్లు వివరించారు. వృద్ధాప్యంలో ఆసరా కావాల్సిన సమయంలో పింఛన్ అందకపోవడంతో పేద కుటుంబాలు



ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు గతంలో అర్హత ఉన్నప్పటికీ పింఛన్ పొందని వారందరి దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వరుణ్ కుమార్ వినతిని పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హతలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు గోవిందరావుపేటకు మంత్రి సీతక్క రాక!

కొత్త పెన్షన్ల పంపిణీకి సర్వం సిద్ధం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ

గోవిందరావుపేట, ప్రభాతవార్త:



గోవిందరావుపేట మండలంలో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం విచ్చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గోవిందరావుపేట మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలడుగు వెంకటకృష్ణ కోరారు.

సి పి ఏస్ ఒద్దు... ఓ పి ఎస్ ముద్దు

సి పి ఎస్ రద్దు కోసం సామూహిక సెలవు కార్యక్రమానికి టి ఎస్ ఏ టి ఎఫ్ సంపూర్ణ మద్దతు

వెంకటాపురం, ప్రభాత వార్త




తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రేపు సి పి ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు చేపడుతున్న సామూహిక సెలవు కార్యక్రమానికి తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ వెంకటాపురం మండల కమిటీ అధ్యక్షులు కారం రాంబాబు, ప్రధాన కార్యదర్శి కుచ్చి0టి ఇంద్రాదేవి సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఉద్యోగుల భవిష్యత్తు భద్రతకు సంబంధించిన సి పి ఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్‌కు తెలంగాణ ఆదివాసి టీచర్స్ ఫెడరేషన్ వెంకటాపురం మండల కమిటీ పక్షాన సంఘీభావం తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి భరోసా కల్పించే పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరణ కోసం ఉపాధ్యాయులందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి..

సామూహిక సెలవు కోరుతూ మండల తహసీల్దార్ కి రెవెన్యూ సిబ్బంది వినతి

వెంకటాపురం అర్జున్ ప్రభాతవార్త

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) ను అమలు చేయాలని కోరుతూ వెంకటాపురం మండల రెవెన్యూ సిబ్బంది మండల తహసీల్దార్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ, "సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడింది. రిటైర్ అయిన తర్వాత కనీస భరోసా లేకుండా పోయింది. ఉద్యోగులందరి డిమాండ్ ఒక్కటే సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ కు మద్దతుగా సామూహిక సెలవు (మాస్ క్యాజువల్ సెలవు) పెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రెవెన్యూ సిబ్బంది హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల రెవెన్యూ సిబ్బంది, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ,వీఆర్వో లు, వీఆర్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.



రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జిల్లా ఆత్మ కమిటీ అధ్యక్షులు చిటమట రఘు

ప్రభాతవార్త ఏటూర్ నాగారం నవంబర్ 16:

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. మండలంలోని గోగుపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా ఆత్మ కమిటీ అధ్యక్షులు చిటమట రఘు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు కునూరు అశోక్ గౌడ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిటమట రఘు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకొని గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు .రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రాథమిక వ్యవసాయ



సహకార సంఘం అధ్యక్షులు కునూరు అశోక్ గౌడ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్, ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, మండల ఆత్మ కమిటీ డైరెక్టర్ దుబ్బాక రాకేష్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగబండ రవి, శివాపురం ఉపసర్పంచ్ వంగపండ్ల సరిత, మండల నాయకులు, రైతులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతే లక్ష్యం!

భూగర్భ జలాల పెంపునకు బాలాజీనగర్ సర్పంచ్ గాంధీ శ్రీకారం

ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.6,500 కేటాయింపు..

ఇంటింటా అవగాహన

గోవిందరావుపేట ప్రభాతవార్త:

గ్రామంలో వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా బాలాజీనగర్ గ్రామ సర్పంచ్ మాలోత్ గాంధీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించాలనే సంకల్పంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం గ్రామంలో 15 ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి ముగ్గులు వేసి పనులకు శ్రీకారం చుట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.6,500 కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఇంకుడు గుంత నిర్మాణంలో భాగంగా ఇంటి ఆవరణలో ఆరు అడుగుల లోతు, నాలుగు అడుగుల వెడల్పుతో గుంత తీయాలి. అడుగుభాగంలో మూడు అడుగుల మేర 40 ఎంఎం కంకర, ఇసుక వేయాలి. అనంతరం మూడు వరుసలుగా



రింగులు అమర్చి, వాటిలో 20 ఎంఎం కంకర నింపి పైన స్లేట్ ఏర్పాటు చేయాలని ఈ.జీ.ఎస్. టీ.ఏ. రాజ్‌కుమార్, సెక్రటరీ దూలం రఘు వివరించారు. ఇంటి యజమాని స్వయంగా ఆరు అడుగుల లోతు గుంత తవ్వితే ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1,200 జమ అవుతాయని తెలిపారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవచ్చని, భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దూలం రఘు, ఈజీఎస్ టీఏ రాజ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

